# మిసిమి

మాస పత్రిక

ఫిబ్రవరి- 2003



వెల రూ. 8/-



జాన్ ఫ్రాగొనార్డ్

(1732-1806)

## చిత్రకారుని గురించి

జాన్ హానరీ ఫ్రాగొనార్డ్ అనే ఈ కళాకారుడు ఫ్రెంచ్ రొకొకొ శైలికి ప్రతిబింబించిన కళాకారులలో చిట్టచివరివాడు. మదామ్ పాంపడోకు అత్యంత ఇష్టమైన ఫ్రాంకో బౌషె దగ్గర నాలుగేళ్ళు శిష్యరికం చేసిన తరువాత ఫ్రాగొనార్డ్ అత్యంతంగా అందరూ వాంఛించే 'ప్రిక్స్ డి రోమ్' బహుమతిని గెలుచుకొన్నాడు. 1756 తదుపరి కళాధ్యయనానికితడు రోమ్ వెళ్ళాడు. అక్కడ రోమ్‌లో బరోక్ పెయింటర్స్ యొక్క మహోత్కృష్టమైన జీవం ఉట్టిపడే అందమైన, ప్రియాతి ప్రియమైన కళాఖండాల నుంచి అత్యంత స్ఫూర్తిని అందుకొన్నాడు. ఆ అందుకోవడంలో టైపోలో, పియాత్రో ద కోర్టొనాల యెడ ఒక ప్రత్యేకమైన మెప్పుకోలును ప్రదర్శించాడు.

పారిస్ తిరిగి వచ్చాడు. ఒక చారిత్రక పెయింటింగ్ వేశాడు. అది ఆయన్ను ఆర్ట్ అకాడెమీ సభ్యుని చేసింది. అంతేకాదు సెలోన్‌లో మంచి గుర్తింపు లభించింది. కాని అతడు తనకు విజయాలను తెచ్చిపెట్టిన ఈ చిత్రాల దారి ననుసరించి పయనించలేదు. చూపు మళ్ళించాడు. అత్యంత 'సన్నిహితత్వాన్ని' ప్రదర్శించే చిత్రాలను చేశాడు. అవి 'సజీవ కామ ప్రకోప' చిత్రాలు - ఈ చిత్రాలకు స్థిరమైన మంచి మార్కెట్ లభించింది. ఫ్రాన్స్ కులీనులు ఈ చిత్రాలంటే మంచి మక్కువ చూపించారు. కాని ఫ్రెంచ్ (1789) విప్లవంతో అతనికి ఆదరణ తగ్గిపోయింది. అంతిమంగా పేదరికంతో పరిత్యక్తుడై అసువులు బాశాడు.

## ముఖ చిత్రం గురించి

'వాంఛా - కావ్యాలు" (Poems of Desire)

ఇటువంటి చిత్రాలకు మార్కెట్ కొదువలేదు. అయితే వీటి 'గౌరవనీయత' సభ్యత, మర్యాదలను అతడి 'అలతినలతి స్పర్శ'. ఆచ్ఛాదిత రూప నిర్వచనాలు పరిరక్షించాయనిగొన్‌కోర్ట్స్ అన్నారు.

మూడవ అట్టపై చిత్రం కూడా ఫ్రాగొనార్డ్‌దే. నాల్గవ అట్టపై చిత్రం ఫ్రాగొనార్డ్ గురువు ఫ్రాంకో బౌషెది.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**


సంపుటి 14 | ఫిబ్రవరి 2003 | సంచిక 2

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


మన నుంచి మనం దూరంగా మనకు మనం దగ్గరగా - వి. అశ్వినికుమార్

''క్రోధాలను, భేషజాలను దేవతలూ జయించలేరు'' - బి.వి. రామిరెడ్డి

నిద్రలేమికి విరుగుళ్లు ఏమిటి ? - సి.వి. సర్వేశ్వర శర్మ

పఠాభి డైరీలో ఒక పుట

స్వగతం నుండి స్వగతానికి - డా॥ యు.ఎ. నరసింహమూర్తి

వేయి పడగల నీడన భావి భారతం! - నరేష్ నున్నా

గోపాత్రుడి బల్లపరుపు భూమి - డా॥ బి. పార్వతి



విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **''వాంఛా - కావ్యాలు''**

చిత్రకారుడు : **జాన్ ఫ్రాగొనార్డ్ ( 1732- 1806)**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# రవీంద్ర వర్ధంతి

డా॥ ఆలపాటి రవీంద్రనాథ్ 1996 ఫిబ్రవరి 11న వ్యావహారికంగా నిర్యాణం చెందారు. ఆయన బౌద్ధాన్ని నమ్మినవారు. బాగా అవగాహన చేసుకొన్నవారు. బౌద్ధులకు మరణం లేదు. పునర్జన్మ లేదు. ఉన్నది పునర్భవం నిర్వాణాలు మాత్రమే. కర్మవిపాకం జరిగితే పునర్భవం నిర్వాణమై వ్యక్తిత్వం నశిస్తుంది. ఆ విధంగా ఆయన పునర్భవం చెందుతూనే ఉన్నాడని మనం భావించాలి.

ఆ పునర్భవం ఇక్కడ ఆయన మిసిమి రూపంలో చెందుతున్నారు. అందుకే 'మిసిమి' ఆయన జీవన తత్వాన్ని (Life Philosophy), జీవనాకాశాన్ని (Life Space) ప్రతిబింబిస్తోంది. ఎరిక్ ఫ్రామ్ అంటే ఆయనకు ఇష్టం. ఫ్రామ్‌ను నాకు పరిచయం చేసి ''ప్రేమించడం ఒక కళ''ను నా చేత అనువదింప జేసింది ఆయనే. ఇంకా ఆయనకు ఆధునిక, ఆధునికానంతర వాదాలను అవగాహన చేసుకోవాలనే తపన ఉండేది. సెక్సువాలిటి గురించి ఎడ్యుకేట్ చేయాలనే ఆకాంక్ష ఉండేది. అందుకే సెక్సు పేరును బహిరంగంగా ఉచ్చరించడానికి భయపడే ఆ రోజుల్లోనే 1948లో తాను స్థాపించిన జ్యోతి, రేరాణిల ద్వారా ఏవలాక్ ఎలిస్, ఫ్రాయిడ్‌లను తెలుగు దేశానికి పరిచయం చేశారు. వీటి అన్నింటిని దృష్టిలో ఉంచుకొనే ఫ్రామ్ మీద, బౌద్ధం మీద, పోస్ట్ మాడర్నిజమ్ మీద, సెక్సువాలిటి మీద, జయ ప్రకాశ్ మీద 'మిసిమి' ప్రత్యేక సంచికలు వెలువడ్డాయి. ఆ సంచికలకు రాసిన వారంతా ఉద్దండ పండితులు, ఆచార్యులు, రచయితలు - వాటిని మిసిమి పాఠకలోకం బహుధా ప్రశంసించింది. మిసిమి ముఖ చిత్రాలను గూడ సౌందర్య నేత్రుడైన (He has on eye for beauty) ఆయన ఊహలకనుగుణంగానే ఎంపిక చేసి వేస్తున్నాము. ఈ మా ప్రయత్నాలంటిని పాఠకలోకం బహుధా ప్రశంసిస్తోంది. అదే మాకు బలం. మేము సరైన బాటలోనే పయనిస్తున్నా మనడానికి అదే గుర్తు.

రవీంద్రనాథ్‌తో అత్యంతంగా పరిచయమున్న వ్యక్తులు 'ఆయనకు ఇలా ఉంటే బాగుంటుంది'' అని చెప్పగలవారుంటే వారు అటువంటి సూచనలు చేస్తే ముకుళిత హస్తాలతో ఆ సూచనలకు స్వాగతం పలుకుతామని హామీ ఇస్తున్నాము.

ఏ పత్రికకైన సహృదయ, రసహృదయ పాఠక ప్రతిస్పందన గీటురాయి. మీ హృదయాల గీటురాతిమీద 'మిసిమి'ని గీసి చూడండి. మాకు రాయండి. అదే ఆయనకు మనమిచ్చే నివాళి. రవీంద్ర హృదయం నిర్వాణం చెందుతుంది.

- సంపాదకుడు

# మన నుంచి మనం దూరంగా
# మనకు మనం దగ్గరగా

- వి. అశ్వినికుమార్

నా దగ్గరకు, చాలామంది, పరిచయం ఉన్నవారు లేనివారు వస్తుంటారు - ఏదయినా ''టూర్ అరేంజ్ చెయ్యండి. ఒక వారం - పది రోజులు అలా, అలా తిరిగివస్తాం'' అంటూ!

దేశంలో, విదేశాలలో యాత్రలకు వెళ్లేందుకు ఉవ్విళ్ళూరుతుంటారు. ఒకసారి వెళ్లి వచ్చిన వారు, మళ్లీ మళ్ళీ వెళ్లాలని కోరుకుంటారు.

మనం ఎందుకిలా ప్రయాణాలు చేస్తుంటాం? పరదేశాలు, పరాయిప్రజలు పరిస్థితులను చూడాలని వేడుకపడతాం? చాలా మందిని అదే అడిగాను, నన్ను నేను ప్రశ్నించుకున్నాను? ఏమయినా సమాధానాలు దొరుకుతాయా? అని.

మన ప్రతి ప్రయాణం - 'మన' నుంచి మనం దూరంగా వెళ్లిపోదామనే.... మళ్లీ మనం పరుగులెత్తేది - మనల్ని 'మనం' కలుసుకోవటాన్కి- తెలుసుకోవటానికే! కనుల్తో పాటు మన హృదయాలను తెరచుకుని - ప్రసార మాధ్యమాలు తెలపగలిగే విషయాల కంటే ఎక్కువగా 'చూడాలనే' తపనతో ప్రయాణిస్తాం. మనతో పాటు - మన అజ్ఞానాన్ని - జ్ఞానాన్ని ప్రకృతి వనరులు పరచుకున్న ప్రపంచపు నలుమూలలకు తీసుకుపోవాలని తాపత్రయపడతాం.

పరుగెత్తే కాలాన్ని ఆపాలని, తిరిగి తిరిగి చిలిపి చిన్నారులవ్వాలని, మన నుంచి మనం దూరమై, తర్వాత మెల్లమెల్లగా మనమేమిటో తెలుసుకోవాలని ప్రతి క్షణాన్ని ఆనందించాలని - ప్రదేశాల ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించాలని ఉవ్విళ్లూరుతాం!

**ఆటవిడుపు :**

ఒక గమ్యం లేని సువిశాల అనంత ఏకాంతంలోనికి, ఏ బంధాలులేని ఆటవిడుపు మైదానంలోనికి పరుగులెత్తి - ఉరకలెత్తి అలసి పోవాలని ఆరాటపడతాం - ఎక్కడికి - ఎందుకీ ప్రయాణం? కొద్దిగా ఆగి - కొంచెం ఆలోచిద్దామా ?

ఏ యాత్రలోనైనా - ఒక గొప్ప సుఖం - సంతోషం - మన బరువు బాధ్యతల్ని - నమ్మకాల్ని - అపనమ్మకాలను ఇంటి దగ్గర వదిలివేసి, మనకు 'తెలుసు' అనుకున్న దానిని వింతగా- భిన్నంగా చూడ ప్రయత్నించటం! ఇప్పుడే మనకి ప్రయాణపు ( యాత్రలోని) సర్వస్వాతంత్ర్యత మనల్ని బొంగరంలా త్రిప్పి - తలక్రిందులు చేసి - మనం క్షుణ్ణంగా ఎరిగిన విషయాలను, సరికొత్తగా దర్శింప చేస్తుంది. మొట్టమొదటి సారిగా మన్‌హట్టన్‌లో అడుగు పెట్టినపుడు నాకెదురైన అనుభవం ఇటువంటిదే.

మొట్టమొదటిగా మనం గుర్తించేది - ఈ యాత్రల్లో మనం సర్వసాధారణమూ - ప్రాపంచికమూ అనుకున్న విషయాలన్నీ - అవి ప్రాదేశికమూ - ప్రాంతీయమూ అయి కూర్చోవటం! లూయివిల్లిలో

---

వి. అశ్వినికుమార్, విజయవాడ, పాన్ ఏషియన్ ట్రావెల్ ఏజన్సీ ప్రెసిడెంట్,
సాహితీ వ్యవసాయం అభిరుచి.

యాభయి సంవత్సరాల సంసార జీవితాన్ని నిరాఘాటంగా సాగించిన దంపతులకు ఊరేగింపు పండుగ జరుపుతున్నారు!! మనకిది మామూలు విషయమే కదా!

అంతేకాదు - మనం ఇంటి దగ్గర - మనదేశంలో - మన ప్రదేశంలో సర్వసాధారణమనుకుంటున్న ఎన్నో విషయాలు

ఆ దూర దేశంలో - లేక మారుమూల ప్రదేశంలో వారికి సాంఘిక - రాజకీయ సంఘర్షణలుగా, చావు బ్రతుకుల సందిగ్ధ సమస్యలుగా మన ముందు నిలబడతాయి!

ఆఫ్రికాలో, అజర్‌బైజాన్‌లో మత రాజకీయాలు, పాలస్తీనా - ఇజ్రాయిల్ నిత్య ఘర్షణలు ఇందుకు తార్కాణం.

అంతేకాదు - మనకెప్పుడో మరుగున పడిపోయిన వార్తా శీర్షికలు - ఒక 'కొత్త' దేశంలో పతాక శీర్షికలై దర్శనమిస్తాయి.

మనం నిన్నకీ - రేపటికీ మధ్యలోని 'అగాథం' లో ఉన్నామా అనే సందేహంలో ఉక్కిరి బిక్కిరి అవుతాం - ఈ వ్యత్యాసం ఎక్కువగా ధనిక - పేద దేశాల సరిహద్దులు దాటినప్పుడు - మీకు ఒక యాత్రా విశేషంగా అనిపిస్తుంది.

ఇంకా మనకు 'ఇంటర్‌నెట్', 'ఒన్‌వర్ల్డ్ వగైరా భ్రమలన్నీ - సరిచేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

ప్రదేశాలను - ప్రజలను చూసిన కొలది, మన - మేర్పరచుకున్న - అగమ్యత, పరధ్యానం, మార్మిక భావనలన్ని పటాపంచలై పోతాయి.

మన యాత్రలద్వారా - అక్కడి ప్రజలతో కలయిక పర్యవసానం : పరస్పరం - పరంపరాగత విషయాలు, సంస్కృతీపరమైన విషయ పరిజ్ఞానం మార్పిడికి - పోల్చి చూసుకోవటానికి అవకాశం కలుగుతుంది. మనం మోసుకు పోయే చిన్న చిన్న సంస్కృతీ చిహ్నాలు - పారంపర్య దుస్తులు - సంగీతం, అక్కడి వారికి - సరికొత్త అనుభూతి నివ్వడమే కాకుండా - ఓ కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తుంటాయి.

**కదిలే వార్తలు :**

ఇంకొంచెం లోతుగా ఆలోచిస్తే - మనతోపాటు మన జీవన విలువలు - నమ్మకాలు, మన దేశపు తాజావార్తలు మోసుకు పోతుంటాం.

అంటే - మనం ఒకరకంగా 'లైవ్' టివిగా, కదులుతున్న వార్తా పత్రికల్లా వ్యవహరిస్తాం. ప్రపంచంలోని ఎన్నో మారుమూల దేశాల్లో పూర్తిగా స్వాతంత్ర్యపు కిరణాలు ప్రసరించని చీకటి దేశాల్లో - మనలాంటి వారే - మనలాంటి యాత్రికులే వారికి - ప్రపంచాన్ని తెరిచి చూపే చిన్న చిన్న కిటికీలు !

అంటే - మన ప్రయాణాల ద్వారా - ఒక రకంగా మనం కనే కలల్ని ఎగుమతి చేస్తుంటాం - అక్కడి వారి స్వప్నాలను ఇటుగా దిగుమతి చేస్తుంటాం - ఎంతో సున్నితంగా స్నేహపూర్వకంగానే ''ఏమిటి, మీ పెద్దలే మీ పెళ్లి నిర్ణయిస్తారా?'' అని ఆశ్చర్యపోతుంటారు!

ఇప్పటికే మీకు అర్థమయివుంటుంది; ఇప్పటి యాత్రలు - కొత్త ప్రదేశాలను దర్శించటంలో ఎంత ప్రాముఖ్యం ఉందో - అంతకు మించి - కొత్త కోణంలో - అక్కడి జనజీవన సరళిని - వారి విశ్వాసాలను స్వప్నాలను - భయాలను పరిశోధించటంలో ఎక్కువ అవకాశం - అవసరం ఉందని. మనం కలిసిన వారికి - మనమెంత కొత్తగా - వింతగా అపురూపంగా పరిచయమవుతామో - అలాగే ఒకసారి మీరు ఇంటికి చేరేసరికి, మీకు బాగా పరిచయంలో ఉన్న మీ స్వంత ప్రదేశాలు - పరివారం - మీ సుదూర మిత్రుని ఆశ్చర్యంలో నుంచి కనపడతారు - కూడా; నాకు ఇన్ని యాత్రల తర్వాత ఇప్పుడు ఎవ్వరిమీదా కోపం రావడం లేదు!

అంటే మీ విహారయాత్రలు, మళ్లీ మిమ్మల్ని, మీ పరిసరాల్ని మీకు సరికొత్తగా పరిచయం చేస్తాయి - ఒక కొత్త వెలుగుతో నింపుతాయి -

అంటే - మన యాత్రలు - రెండు విధాలుగా మనకు ప్రయోజనకారిగా ఉంటాయి.

ఒకటి, మామూలుగా మనం పట్టించుకోని, ప్రదేశాలు - విలువలు - ముఖ్య విషయాలు అన్ని మన ముందుకు వస్తాయి.

రెండు, అదే సమయంలో - మనలో నిద్రాణమై - అంతగా పట్టించుకోని కోణాలెన్నో -వెలుగు చూస్తాయి. ఈ ప్రయాణాలు - తప్పని సరిగా మన సుప్తమైన - అవ్యక్తమైన మానసికి దశలను స్పృశిస్తాయి - నిద్రలేపుతాయి. ఒక ప్రదేశం - సహారా ఎడారిగాని - చెట్లులేని ఐస్‌లాండ్ గాని దర్శించినపుడు - మన మానసిక స్థితి - ఒక్కసారిగా అంతర్ముఖమై మనలోని - ఒంటరితనాన్ని, ఏకాకిస్థితిని ఒక్కసారిగా ముందుకు తెస్తుంది!

యాత్రికులుగా మనం ఒక క్రొత్త దేశం వెళ్తే - మనం ఎంత 'ఫ్రీ 'గా ఉంటాం! మన కులం - మతం - జాతి - ఎవ్వరికీ పట్టదుకదా; అలాగే మనకు ఒక పేరు గాని, ఒక 'టాగ్' గాని ఉండాల్సిన - అవసరం రాదు కదా - మనల్ని ఎవ్వరూ 'గుర్తించ' నపుడు - మనం దేన్ని గురించి 'జాగ్రత్త' తీసుకోవాలి ?

**అనంతవాదులు ... :**

అందుకని - ఒక్కసారిగా, మనముందు మనం నిలబడతాం - మనం ఏమిటో చూసుకోవాల్సిన అవసరం, అవకాశం వస్తుంది. ఇందుకు మనకు ఉండే రోజువారీ వత్తిడులు లేక పోవడటం కూడా ఒక కారణం !

దూరదేశాల్లో - మనకు ఎక్కువ సేపు నిద్రపట్టక - రాత్రిళ్లు మెలకువగా ఉంటాం - అందుకే కనులు తెరచుకుని సీలింగ్ వంక చూస్తూ ... ఆశ్చర్యపోతుంటాం - ఏమిటి - కొత్తగా ప్రేమలో పడినట్లు నిన్న - రేపు గురించి ఆలోచన లేకుండా, ఆకాస్సేపు - ఆక్షణంలో జీవిస్తాం.

మనల్ని మనం విశ్లేషించుకుంటూ విలువైన సమయాన్ని గడిపేందుకు అవకాశం దొరుకుతుంది! మన మనసులోని మర్మాలన్ని మన కనులముందు కదులుతాయి - సరిగ్గా ఇప్పుడే - ఎక్కడ బయలు దేరాం? ఎక్కడ ఉన్నాం - ఎక్కడకు వెళ్తున్నాం - అన్నీ ఒక మిస్టరీలా కలగలసిపోతాయి ! అనంతవాదులుగా మారిపోతాం ?

మనకు 'తెలియకుండా' మనం ఎంతదూరం వెళ్లగలం? కుదరదు కదా! అది జరిగే పనికాదు కదా !

ఇందులో ఒక ప్రమాదం పొంచి ఉంది కూడా, అన్ని రకాల స్వేచ్ఛలకు ఉన్నట్లుగానే - కాని ఇక్కడ ఉన్న ఒకగొప్ప అవకాశం - మనం మళ్లీ 'జన్మించటం'! అంటే - చిన్ననాటి కాలానికి, ఇంకా విశాలమైన ఆలోచనలోనికి అంతర్ముఖులై ఒక రకమైన మానసికి స్థితిలోకి వెళ్లగలగటం కాలాన్ని ఒక్క క్షణం - ఆపగలగటం!

**తెలియని భయం**

ఇంకా మన చుట్టూ ఎన్నో పరిచయంలేని పరిసరాలను చూసి - చిన్న పిల్లల్లా ఆశ్చర్యపోవటం! మాటలు రాని - భాష తెలియని చిన్నారుల్లా కలిసిన వారితో మాట్లాడగలగటం! మనల్ని మనం తెలియపరచుకోవటం -

ప్రయాణం మనల్ని తెలియని ప్రదేశాలకు తీసుకుపోతుంది - మనకు ఏమి తెలియదో కనువిప్పు కలిగిస్తుంది.

ఒక తెల్లకాగితంలా మనం ఉంటాం - ఒక 'బయోడేటా' ఎవరూ రాయరు - 'నువ్వు' ఫలానా అని ఎవరూ 'ఫిక్స్' చెయ్యరు - అందుకని - ఒక కొత్త స్వేచ్ఛ కొత్తస్వరూపం సంతరింప చేసుకుంటాం.

మన 'అనన్యతను' ప్రక్కనపెట్టి ఒక కొత్త మూసలోకి మీకు మరింత దగ్గరగా ఉండే - మీలోకి చూడగలుగుతారు! మీరు తీసుకువెళ్లే రెండు మూడు బట్టలతో - తేలికగా - 'సింపుల్'గా ఏదో 'సాహసా' నికి సిద్ధంగా కదులుతుంటారు!

బ్రాంక్స్‌లో నాకంటే అడుగు ఎత్తుండి కనీసం వంద కిలోల బరువున్న ఒక హిస్పానిక్ లేడీ ''హే, డిడ్ యూ స్టార్ట్ యువర్ ఎడ్వంచర్...'' అంటూ నవ్వింది!

ఇక్కడే ఆల్బర్ట్‌కామూ అన్న మాటలు గుర్తుకు వస్తాయి. ''తెలియని 'భయంలోనే' ప్రయాణానికి విలువ పెరుగుతుంది!'' 'ప్రతి ప్రయాణంలోని నిగూఢమైన భయమే దాని విలువను పెంచుతుంది'.....

పరిసరాలనుంచి - పరిస్థితుల ప్రభావం నుంచి విముక్తులవటమే కాకుండా, మన అవసరాలన్నీ అస్తవ్యస్తమై పోతుంటాయి - కారణం - మన అలవాట్లన్నీ అర్థంలేని ముసుగులేనని అర్థమవుతుంది !

మనకు ప్రొద్దున్నే కాఫీ అలవాటుంటే, అదే మన ప్రయాణాలలో దొరకకపోతే కొంపలంటుకు పోవు -

మనకు జరిగే అవమానాలను పెద్దగా పట్టించుకోము. ఎడిసన్‌కి దారి - (రూట్) అడిగితే ఒక రెడ్‌నెక్ ''ఏమిటి. బ్రెడ్ కోసం వెళ్తున్నావా''... అంటూ ఎగతాళి చేశాడు -

ఒక సిగ్నల్ లైట్ దగ్గర ప్రొద్దున్నే - ఒక తెల్లజాతివాడు మా కారు విండ్‌స్క్రీన్ మీద కోపంగా కాఫీ పోసిపోయాడు - మేము అరక్షణం ఆలస్యం చేశామని !

అందుకని మనం ఏదో 'తెలుసు' కోవాలని - దేనికో సమాధానం దొరుకుతుందని పరుగులెత్తం! కాని మనకు ఎదురైయ్యేది - ఒక కఠోర సత్యం - అరే ఇది ఇలా జరుగుతుందా? దీనిలో ఎంతవరకు న్యాయం ఉంది? అన్న ప్రశ్నలే మోసుకు వస్తుంటాము. ఇక్కడ, మనం రాత్రిళ్లు ఏ భయమూ లేకుండా వీధులన్నీ తిరుగుతుంటాము. సర్వసాధారణంగా - అదే న్యూయార్కులో - చీకటిపడితే - అంతా భయమే - రోడ్లన్నీ కర్ఫ్యూ పెట్టినట్లే- థాయిలాండ్‌లో, ఫిలిప్పైన్స్‌లో - ఎందరో యువతులు - తమ కుటుంబాలను పోషించటానికి - వళ్లమ్ముకోవటానికి వెనకాడరని - ఒక 'నగ్న' సత్యాన్ని గుర్తించేసరికి, బాధ, ఆశ్చర్యం కలుగుతుంది.

ఇంకా కొన్ని ప్రదేశాలలో మన ప్రయాణం ఒక డిటెక్టివ్ క్రైం కథలా సాగినా ఆశ్చర్యపోనవసరం లేదు - ఎటొచ్చి - ఆ కథకు ఒక ముగింపు ఉండదు!

అట్లాంటా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో - నాతో పాటు వచ్చిన ఒక స్నేహితుడు - ఇమ్మిగ్రేషన్‌లో మాయమై పోయినపుడు నాకంతా అయోమయం - క్రైం కథలా అన్పించింది!

అలాగే హాంగ్‌కాంగ్ ఎయిర్‌పోర్ట్‌లో, నా మిత్రుడు తెచ్చిన, మనం రోజూ తినే ''గన్‌పౌడర్'' చూసి కస్టమ్స్ వాళ్లు ''స్నిఫ్ డాగ్స్'' తో అతనికి చెమటలు పోయించారు.

**ప్రేమ కథ**

ఒకనెల రోజులు ఐరోపా, అమెరికా అంతా తిరిగి తిరిగి ఇంటికి చేరిన తర్వాత - ఎన్ని రాత్రులు నిద్రలేకుండా పడివున్నాను? -చూసినవి గుర్తు చేసుకుంటూ, తీసిన ఫోటోలు మళ్లీ మళ్లీ చూసుకుంటూ - రాసుకున్న నోట్సులు తిరిగి తిరిగి చదువుకుంటూ కలిసిన వాళ్లను నాకు సహాయం చేసిన వాళ్లను - తోసివేసిన వాళ్లను - పగటి రెస్టారెంట్లను - నైట్‌క్లబ్‌లను - మహోధృత - నయాగరా హోరును - నెవెడా ఎడారి నిశ్శబ్దాన్ని - అలాస్కా నిర్జీవ హిమశీతల మృత్యు సామీప్యాన్ని, ఆస్ట్రియాలోని ఆత్మహత్యల ఆల్ప్స్ పర్వతాలను, సబ్‌వే రైలు శబ్దాలు - జెట్ విమానాల నిశ్శబ్ద వేగాలు - ఎన్ని - ఎన్ని నన్నలా - క్రొత్త ప్రేమికునిలా - నిద్రలేకుండా పడవేసినాయి! - ఇంత పునరుజ్జీవన శక్తి ఈ ప్రయాణాలకు ఎలా వస్తున్నది?

ఒక రకంగా ప్రతి విదేశయాత్ర - ఒక ప్రేమ వ్యవహారమే అనిపిస్తుంది!

ఏం మాట్లాడాలో తెలియదు! ఎక్కడికి, ఎలా వెళ్లాలో అగమ్యంగా ఉంటుంది - వెళ్లినకొలదీ - లోతుగా పాతుకు పోతుంటాము - ఎవరిని ప్రేమిస్తున్నామో తెలియక, ఎలా తెలియజేయాలో భాషరాక - ఒక తీయని భయం! ఒక మాయని ఆశ్చర్యం - ఈ విదేశ యాత్రలన్నీ - అద్భుతమైన ప్రేమ కథలే అనిపిస్తుంది!

ఇంకా మనం కలలుకని - కళ్లలో తారలు నింపుకుని వెళ్లే ప్రదేశాలు - హాలీవుడ్ లాంటివి, మన కలల్ని ఎగతాళి చేస్తూ తళుకుతారలన్నీ జలతారు తోరణాలని తెలియజేస్తూ - నమ్మశక్యం గాని - మాయాజాలమని మన కళ్లు తెరిపిస్తాయి - కాని ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత అవే మనకు మళ్లీ

కలల్లా - కలల తీరాల్లా అనిపిస్తుంటాయి. మనం కలల్ని నమ్మటానికి కలల్లో నడవటానికి ఇష్టపడతాం కదా! మనం ఇంటి దగ్గర - ఎంత నిరాశా నిస్పృహలతో ఉన్నా - ఒక కొత్త ప్రదేశానికి, విదేశానికి వెళ్లగానే ఎనలేని ఎనర్జీ - అంతులేని 'ఆశా' వేశం మనల్ని చుట్టుముడతాయి - ఒక్క క్షణం ఖాళీగా ఉండనివ్వవు - అంటే మన కదలికలోనే - కలల దర్పణం, ప్రయాణంలోనే అంతులేని 'ఆనందం' దాగి ఉన్నాయా? ఇంటి దగ్గర ఉండే స్తబ్దతలో నుంచి దూరంగా జరిగిపోవటమే ఒక చైతన్యం!

ప్రపంచపుటంచులు చూడటం, దిగంతాల - తీరాలను తాకడం - ప్రయాణం కాదు. ఒక రకంగా ''ఎండ్ ఆఫ్ ది ఎర్త్'' ఎక్కడ ఉంటుంది? 'మళ్లీ నిన్ను నువ్వు చేరటంలోనే కదా!'

ప్రపంచమంతా - ఒక అపరిచితునిగా, పరదేశస్తుడుగా 'అన్యుడు'గా (సంస్కృతిపరంగా) ఆయా ప్రజల మధ్య తిరిగి - వారి అలవాట్లను, తినుబండారాలను రుచి చూసి, ఒక్కసారిగా 'ఇంటికి' తిరిగివస్తే ఉండే అలసట - ఆనందం, 'స్వీయ' దనం మనల్ని ఎంతో ఆశావాదులుగా మార్చివేస్తుంది!

**కదలిక ఆంతరికం**

అసలు కదలిక అనేది మనకు ఉయ్యాల రోజుల నుంచే మొదలయ్యిందేమో? అలాగే ప్రతి కదలిక ఆంతరికమే కనిపిస్తుంది - ఒక పుస్తకం చదివినపుడు - ఒక సినిమా చూసినపుడు - ఒక కొత్త పరిచయం ఏర్పడినపుడు, ఈ కదలిక ఫీలవుతాం - మనకు తెలుస్తుంటుంది. ఒక మంచి నవల చదివితే - అది ఒక యాత్ర! ఇది మరింత లోతుగా పరిశీలించితే,

మన ప్రతి ప్రయాణం - ఒక అపురూపమైన యాత్ర. మనం తిరిగి దర్శించిన ప్రదేశాల ప్రత్యేకతను - మనలోని మారుమూల కోణాలతో నింపుకుని - మనం సంపూర్ణులయ్యేందుకు దోహదపడతాయి. మనం దర్శించిన వాటితో మన ఊహాపోహలను రంగరించి - ఒక నూతన సత్యాన్ని సృష్టించుకోవటమనేది ఒక అసాధారణ - ప్రక్రియ !

మనం బయట ప్రపంచంలో మనకు కనిపించే సత్యాలు - మనలో నుంచి - వెలికి తీయగలగాలి - మన హృదయాలలోనే - మనం బయట వెదికేవెన్నో వున్నాయి - సుందర నందన వనాలు - ఎల్లలులేని ఎడారులు - చీకటి కీకారణ్యాలు, మంచుకొండల అంచులు, అన్నీ మన మనసు మారుమూలల్లో దాగి ఉన్నాయి.

అంటే - మనం ఎక్కడకు వెళ్లినా - మనము - మన ఇంట్లో మనవాళ్లు - మనలోనే వుంటారు కదా. అలాగే - మనం వెళ్లాలనుకున్న స్థల ప్రదేశాలను మనతో మోసుకు పోవాలి - ఎన్నో ప్రముఖమైన సుదూర తీరాలు, మరెన్నో సువిశాల ప్రదేశాలు, తరచూ మన ప్రక్కన నిదురపోతున్న వ్యక్తిలోనే ఉండవచ్చు!

హృషీకేష్, బదరీనాథ్‌లలో మంచులాంటి గంగలో స్నానం చేసి అక్కడ ఆలయ ప్రాంగణంలో నిద్రపోయే సాధువులను చూస్తే అదే అన్పించింది!

**జాగృతి**

ఇప్పుడు - ప్రయాణాలు - యాత్రలు - బాహిరమూ - ఆంతరికము కూడా, మనల్ని చైతన్యంతో నింపేవిగా జాగరూకుని చేసేవిగా ఉంటాయి! ఒక తెలియని విషయాన్ని తెలుసుకోవటంలో - ఒక విజ్ఞత ఉంది, అది బుద్ధి కుశలతను పెంచుతుంది, దురభిమానాన్ని రూపు మాపుతుంది; హాస్యప్రియత్వాన్ని పెంచి పోషిస్తుంది.

జర్మనీలో 'నడివేసవిలో' ఒక మిట్టమధ్యాహ్నం నడి రోడ్‌లో నడుస్తూ గడ గడ వణకుతుంటే, 'ఇది సమ్మర్, ఎంజాయ్ '... అంటూ సలహా ఇచ్చాడు ఓ పెద్దాయన!

ముస్సోరిలో కారులో నుంచి కాలు కింద పెడితే - కసుక్కున కరిచింది చలి! ''ఇవ్వాళ చాలా తక్కువ, దిగండి'' తొందర పెట్టాడు డ్రైవరు!

అంటే "open eyes"తో ఉండాలి - అని, బౌద్ధబిక్షువులు ఎప్పుడూ తిరుగుతుంటారు - అంటే జాగరూకులై - ప్రపంచాన్ని దర్శిస్తూ - తమనితాము తెలుసుకుంటూ ... గీతాచార్యుడు అన్నట్లు - మనిషి ''ఎప్పుడూ జాగరూకుడై'' ఉండాలి!

మనం ముందు అనుకున్నట్లు 'ట్రావెల్' - ప్రేమలాంటిదే అయితే, దానికి కారణం - మనల్ని నిద్రపోనివ్వకుండా, ఒక విచిత్ర మానసిక స్థితిలో ఉంచటమే!

ఆస్థితిలో మనం వింటాం - చూస్తాం - తెలిసిన విషయం అని దేనినీ అశ్రద్ధచెయ్యం, ఉపేక్షించం! ఇంకా - మార్పుకు సిద్ధంగా
ఉంటాం!

అందుకనే - ఎన్నో యాత్రలు - మంచి ప్రేమ కథల్లానే
అలా సాగుతూనే ఉంటాయి! ''చరైవేతి!'' మనువు.

సత్యాసత్యాల నిరంతర సమ్మేళనం,
ఊహాపోహల అపూర్వ సంగమం -
మన జీవన యాత్ర!

పరిశీలించిన రచనలు : ఆల్బర్ట్ కామూస్, పీకో అయ్యర్, సాంతాయన.

పలకరించిన వ్యక్తులు : నా యాత్రలకు సహకరించిన మిత్రులు - అపరిచితులు, తమ అనుభవాలను ఏకరవు పెట్టిన ఎందరో నాళ్లయింట్సు!

# ''కోర్కెలను, భేషజాలను దేవతలూ జయించలేరు''

## (1919వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కార స్వీకారోపన్యాసము)

మూలం: కార్ల్ ఫ్రీడ్రిక్ జార్జి స్పిట్లర్ అనువాదం: బి.వి. రామిరెడ్డి

నేను 1845, ఏప్రిల్ 24న లీస్టర్ లో జన్మించాను. నాకు నాలుగు సంవత్సరాల వయసున్నప్పుడు మేము బెర్న్‌కి వెళ్ళి పోయాము. అక్కడ మా నాన్నగారికి స్విస్ కన్ఫెడరసీలో కోశాధికారిగా ఉద్యోగం వచ్చింది. 1856 - 57 శీతాకాలంలో నా తల్లి దండ్రులతో ఇంటికి తిరిగి వొచ్చాను. మా అత్తయ్యగారితో లీస్టర్‌లో ఉంటూ బాస్లిలోని ఓబెర్ జిమ్నాసియంలో చదువు కొనసాగించాను. దీన్నే పెడగాజియం అనేవారు. విల్హెల్మ్ వార్నగెల్, జాకబ్ బర్క్‌హార్ట్ నా గురువులు. మా నాన్నగారి ఆదేశానుసారం 1863లో జ్యూరిచ్ విశ్వవిద్యాలయంలో లా చదివాను. 1865 - 70 ల మధ్య జ్యూరిచ్, హెడెన్ బర్గ్, బాస్లి విశ్వవిద్యాలయాలలో థియాలజి అభ్యసించాను. పరీక్షలు పూర్తయ్యాక జనరల్ స్టాండర్ స్కోల్డ్ ఆహ్వానంపై ఆయన పిల్లలకు ట్యూటర్‌గా ఉండేందుకు 1871 ఆగస్టులో పీటర్స్‌బర్గ్ వెళ్ళాను. 1879 వరకు అక్కడ వున్నాను. ఆ రోజుల్లో కొంత కాలం రష్యాలోను, కొంతకాలం ఫిన్లాండులోను గడిపాను. ఆ రోజుల్లోనే ''ప్రోమీథియస్ అండ్ ఎపిమీథియస్'' మీద కృషి చేశాను. 1881లో సిట్జర్లండుకు తిరిగి వొచ్చాక ఆ గ్రంథాన్ని 'కార్ల్ ఫెలిక్స్ టాన్డెమ్' అనే పేరుతో ప్రచురించాను. ఈ పుస్తకాన్ని పాఠకులు, సమీక్షకులు, ఎవరూ గుర్తించలేదు. కవితా రచనను జీవనాధారం చేసుకున్నందువల్ల ప్రయోజనం లేదని గ్రహించి, ఉపాధ్యాయుడిగా పని చేశాను. వార్తా పత్రికలకు వ్రాస్తుండేవాణ్ణి. 1892 జులైలో, అదృష్టవశాత్తు నాకు ఆర్థిక స్వాతంత్ర్యం లభించింది. 'లుసెర్న్' కి వెళ్ళిపోయి, నా కుటుంబంతో సంతోషంగా జీవించ సాగాను. ''ప్రోమీథియస్ అండ్ ఎపిమీథియస్ (1883), ''బట్టర్‌ఫ్లైస్'' (1889), ''ఫ్రీడ్లేడెర్‌కాల్డెరి'' (1891), ''గుస్టావ్'' (1892), ''లిటరరీ పేరబుల్స్'' (1892), ''బల్లాడెన్'' (1896), ''డెర్ గొట్టార్డ్'' (1897), ''కాన్రాడ్ డెర్ ల్యూటినెంట్'' (1898), ''లాఫింగ్ ట్రూత్స్'' (1898) రచించాను. 1900 - 1906ల మధ్య ''ఒలింపియన్ స్ప్రింగ్'' ను నాలుగు భాగాలుగా ప్రచురించాను. అవి 1) ఓవర్చర్, 2) హెరా ది బ్రైడ్, 3) హై టైడ్, 4) ఎండ్ అండ్ ఫేజ్. నా ఇతర గ్రంథాల్లాగే, మొదటి రెండు భాగాలను ఎవరూ పట్టించుకోలేదు. కాని; రెండు, మూడు భాగాలు ప్రచురితమౌతున్న రోజుల్లో, ప్రసిద్ధ సంగీత కారుడు ఫెలిక్స్ వెయిన్‌గర్ట్నర్ ఒక పాంప్లెట్ ద్వారా నన్ను జర్మన్ ప్రజలకు పరిచయం చేశాడు. ఆ విధంగా ఆయన నన్ను ప్రపంచానికి తెలియజేశాడు.

1909లో నా మహాకావ్యం నాలుగు భాగాలుగా ప్రచురింపబడింది. 1920కల్లా అది అనేక పర్యాయాలు పునర్ముద్రింపబడింది. ''ఒలింపియన్ స్ప్రింగ్'' తరువాత ''బెల్‌సాంగ్స్'' (1906), ''ఇమాగో'' (1908), ''టు లిటిల్ మిసోగ మిస్సెస్'' (1907), ''మై ఎర్లీయస్ట్ ఎక్స్‌పీరియన్సెస్'' (1914) ప్రచురించాను.

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

హెరాల్డ్ హజార్నె, (ఛైర్మన్, నోబెల్ కమిటి)

1919వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారాన్ని స్విస్ కవి కార్ల్‌స్పిట్లర్ రచించిన మహాకావ్యం 'ఒలింపియన్ స్ప్రింగ్' కు ఇవ్వాలని నోబెల్ అకాడమి నిర్ణయించింది.

ఈ మహాకావ్యానికి ఈ మధ్య సంవత్సరాల్లోనే మంచి ప్రాచుర్యం లభించింది. ఆ మహా కావ్యానికి సంబంధించిన సందేహాలను పరిహరించి ఆ కావ్యపు గొప్ప లక్షణాలైన కావ్యత్వ, కళాత్మకతలను జాగ్రత్తగా పరిశీలించవలసి వుంది.

ఈ కవియొక్క సాహిత్యానికీ - పాఠకుల అవగాహనకూ మధ్య ఏర్పడిన వెలితివల్ల ఎవరికీ లోపం జరక్కపోగా ఆ కావ్యార్థాన్ని లోతుగా, విస్తృతంగా అర్థం చేసుకునేందుకు వీలుకలిగింది.

స్పిట్లర్ రచించిన మహాకావ్యం 'ఒలింపియన్ స్ప్రింగ్' స్వీడన్, జర్మనీలలో బహుళ ప్రచారం పొందింది. 1909 నుండి ప్రపంచయుద్ధం ముగిసేవరకు ఈ కావ్య పఠనాభిలాష పాఠకుల్లో దినదిన ప్రవర్థమానమౌతూ వొచ్చింది. అందువల్ల ఈ కావ్యం అనేక పునర్ముద్రణలుపొంది వేలాది కాపీలు అమ్ముడు పోయాయి. ఈ రోజుల్లో 600 పేజీల, ఒలింపిక్ దేవతలను గురించిన పద్యకావ్యాన్ని పఠించాలంటేపాఠకుడికి తీరిక, ఓపిక ఉండాలి. ఇలాంటి కావ్య నిర్మాణంలో తన కవితా శక్తిని, దశాబ్దాల కాలాన్ని వినియోగించిన కవి తన సమకాలీన సామాజిక జీవితపు వొత్తిడుల నుండి తననితాను దూరం చేసుకున్నాడు.

ఈ వైరుధ్యాలను మెత్తబరిచేందుకు అతడేమీ ప్రయత్నించలేదు. అందుకు భిన్నంగా, కావాలనే, పాఠకులను గందరగోళ పరిచే, పాఠకులలో వ్యతిరేకతను రేకెత్తించే విషయాన్ని, రూపాన్ని ఎంచుకున్నాడు. అలాంటి కవితా ప్రపంచాన్ని అవగాహన చేసుకోవడం కష్టతరం. మొదటి నుండి అతడు ధైర్యంగా తన నాయకుల నాటకీయమైన సంభాషణల, అంతర్మథన స్వగతాలదారిన ఓపికగా ప్రయాణించేందుకు, చిత్రమైన కవితా మార్గాలలో తనపాఠకులను తనతో బాటు నడిపించుకునేందుకే ప్రయత్నించాడు. అలాగ అతడు హోమర్ విధానాలను అనుసరించినప్పటికీ, ఒక అనుకోని గమ్యాన్ని చేరుకున్నాడు.

అయితే హోమర్‌కు స్పిట్లర్‌కు మధ్య వారి కావ్య నిర్మాణాల్లో చాలా తేడాలు కొట్టవచ్చినట్టు కనబడతాయి. అతడు తన ప్రతీకలతో, ఉదాహరణలతో భాషా శాస్త్ర వేత్తలను, వారి శిష్యుల్ని, వారి పాండిత్యాన్ని ఆకర్షించే ప్రయత్నం చేశాడు. అతని ఒలింపియన్‌దేవతలు, నాయకులు, పురాణగాథలు, గణాచారులు ప్రాచీన గ్రీకు తాత్విక కవుల్ని అరుదుగా మాత్రమే గుర్తుచేస్తారు. స్పిట్లర్ ఎవర్నీ అనుకరించడు. అతని పురాణం పూర్తిగా అతని వ్యక్తిగతం. అతని పాత్రల జీవన సమరం, అంతర్మథనం, అతని ఆదర్శ ఊహాత్మకత నించి; మానవుడి ఆశలు, వైఫల్యాలు, ఎండమావుల వెంట పరుగులు మొదలైన జీవితపు వొత్తిళ్ళనించి రూపుదిద్దుకున్నవే. కల, నిజం కలగలసిన తన రచన ఆధునిక కళామర్మజ్ఞులకు అర్థంకానందుకు అతడేమీ బాధపడలేదు.

స్పిట్లర్ 'ఒలింపియన్ స్ప్రింగ్' కు సమగ్రమైన సమీక్షను ఇచ్చేందుకు ప్రయత్నించాను, కాని అది

అసాధ్యం. ఒలింపస్‌కు చెందిన ప్రకాశవంతమైన జీవితం, విశ్వం, సౌఖ్యాలు, బలీయమైన పరీక్షలు - మానవుడి కృతఘ్నత, నేరం, విషాదం మొదలైన వాటి ముందు బలహీనమైన కోరికలుగా అనిపిస్తాయి. జయస్ కుమారుడైన హెర్క్లిస్ తండ్రి, బంధు మిత్రులు అతనికి గొప్ప సంపూర్ణతనిచ్చినా, అతడు దేవతల రాణి అయిన హెరా ద్వేషంతో, శాపంతో నలిగిపోతాడు.

తమ సాహస కృత్యాలతో, కార్యాలతో, పోరాట విజయాలతో వారి అంతఃకలహాలతో ఒలింపియన్స్ ఎంత మానవాతీతులు అయినప్పటికీ వారి కోరికల్నీ, భేషజాల్ని నిర్మూలింప జేసుకోలేకపోయారని కవి తెలియజేస్తాడు.

వాటన్నింటికంటె కర్మను శాసించే విశ్వనాయకత్వం ఒకటుంది. వాటికి దిగువన మనకు దగ్గరగా పారిశ్రామికీకరణ, ఆత్మ రహితమైన ప్రకృతి శక్తులున్నాయి. వాటిని దేవతలు, మనుషులు తమకోసం తామే ఉపయోగించుకోవాలి. అయితే మనిషి వాటిని తన అహంకారంతో, ద్వేషంతో దుర్వినియోగపరిచి నాశనానికి ఉపయోగిస్తున్నాడు. ఈ మహా కావ్యం విమానాలు మొదలైన విచిత్ర సృష్టులతో, మహా సౌధాలతో హోమర్‌ని మరిపిస్తుంది. అయితే మనుషులు కృత్రిమ సూర్యుడిని సృష్టించి, విశ్వాంతరాళాల మీద సూర్యుడి పెత్తనాన్ని అంతం చేయాలనే ప్రయత్నంలో, విషవాయువులతో నిర్మించిన శకటంతో సూర్యుడి మీద దాడిచేయడం - మనిషి తన భౌతికశాస్త్రజ్ఞాన శక్తులతో, మితిమీరిన స్వాభిమానంతో తన సర్వ నాశనాన్ని తానే కొని తెచ్చుకోవడాన్ని రుజువు చేస్తుంది.

అరిస్టో లాగా స్పిట్లర్ అలాంటి విచిత్రమైన లక్షణాలను హాస్యాత్మకంగా తన నాయకుల ద్వారా వర్ణిస్తాడు. అతని శైలికి గొప్ప వైవిధ్యముంది. అతని ఉపమానాలు, ప్రకృతి వర్ణనలు తన జన్మ భూమిలోని ఆల్ప్స్ సౌందర్యాలను గుర్తుచేస్తాయి. అతని ఇయాంబిక్ హెక్సామీటర్లు తమ పురుష స్త్రీత్వా లయలతో అతని భాషా శక్తిని ప్రవహింప జేస్తాయి. అవి అతని మాతృభాషాలక్షణాలే.

ఈ అకాడెమి స్పిట్లర్ కవిత్వపు స్వేచ్ఛా సంస్కృతికి ఈ పురస్కారాన్నివ్వడానికి సంతోషిస్తున్నది. అనారోగ్య కారణాలవల్ల స్పిట్లర్ ఇక్కడికి వొచ్చి స్వయంగా ఈ పురస్కారాన్ని అందుకోలేక పోతున్నారు. అందుచేత స్విస్ ఎంబసీద్వారా ఈ పురస్కారాన్ని వారికి అందజేస్తున్నాము.

★ ★ ★

ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆస్కార్ మాంటెలియస్, స్వీడిష్ విదేశాంగ శాఖామాత్యులు కౌంట్‌రాంగెల్‌కు ఈ పురస్కారాన్ని అందజేసి, అకాడెమి తరపున వారి గౌరవాభివాదాలను కవికి తెలియజేయవలసిందిగా కోరారు. ఆయన అనారోగ్యం నుండి త్వరగా కోలుకోవాలనీ, 'ఒలింపియన్ స్ప్రింగ్' లాంటి మహాకావ్యాలను మరిన్నిటిని రచించాలనీ ఆశవెలిబుచ్చారు.

కార్ల్ స్పిట్లర్ (1845-1924) ''ప్రొమాథియస్ ది సఫరర్'' పేరుతో తన కావ్యాన్ని 1924లో ప్రచురించాడు. అతని సంపూర్ణ గ్రంథాలు తొమ్మిది సంకలనాలుగా 1945-50ల మధ్య జ్యూరిచ్‌లో ప్రచురింపబడ్డాయి.

# నిద్రలేమికి విరుగుళ్లు ఏమిటి ?

– సి. వి. సర్వేశ్వర శర్మ

మన సమాజంలో కొంత మందికి నిద్ర సరిగా పట్టకపోవడం, తక్కువగా పట్టడం, నిద్రలేమితో భాదపడడం వంటివి జరుగుతూ ఉంటాయి. ఇన్‌సోమ్నియాగా పిలువబడే ఈ నిద్రలేమి సమస్యకు విరుగుడు తెలియక చాలామంది బాధపడుతూ ఉంటారు.

నిద్రలేమివల్ల అనేక రకాలయిన దుష్ఫలితాలు కల్గుతూ ఉంటాయి.

* అవిశ్రాంతిగా తయారవుతారు.
* మూడీగా ఉంటారు.
* ఆలోచనా సామర్థ్యం, ఉత్పత్తి శక్తి తగ్గుతుంది.
* శరీర ఇమ్యూనిటీ వ్యవస్థ బలహీనపడి సులువుగా వైరస్‌లదాడికి బలయిపోతూ ఉంటారు.
* ఆటో ప్రమాదాలు ఎక్కువగా ఈ నిద్రలేమి గల డ్రైవర్ల వల్ల జరుగుతాయి.
* ఈ బాధగల ఉద్యోగులు తరచు ఉద్యోగానికి వెళ్లక పోవడం వల్ల ఆ కంపెనీలు ఆర్థికంగా దెబ్బతింటూ ఉంటాయి.

**ఎంత నిద్ర కావాలి ?**

సుఖనిద్ర మనిషికి ఎంతకావాలి? అనేది మనిషి మనిషికీ మారుతూ ఉంటుంది. మనలో చాలా మందికి కనీసం అనుదినం రాత్రి 7 లేక 9 గంటలు నిద్ర అవసరం.

ఆడవారిలో చాలామందికి 'నిద్ర' పట్టడంలో ఎంతో సమస్యను ఎదుర్కొంటూ ఉంటారు. మెనోపాజ్, గర్భిణీ, రుతుస్రావం తరువాత ఆఖరి రెండు వారాల సమయాలలో వీరికి నిద్రపట్టకపోవడం ఒక ఇబ్బందిగా తయారవుతుంది.

మనిషి మెదడు - మనసు రోజంతా శ్రమించిన తరువాత తిరిగి శక్తిని పుంజుకునేందుకు కొంత విశ్రాంతి సమయం అవసరం. మనిషి శ్రమించడం అంటే ఏదైనా కావచ్చు. ఆడవచ్చు, పాడవచ్చు, పాఠాలు చెప్పవచ్చు, ఇంటిపని, పిల్లల పని ఏదైనా చేయవచ్చు.

తగిన విశ్రాంతి మెదడు - మనసు పొందగల్గితే మళ్ళీ పనిచేసే శక్తిని అవి పొందగల్గుతాయి. తగిన నిద్ర లేక పోతే మనసు ప్రశాంతంగా, స్పష్టంగా, సమర్థవంతంగా పనిచేయలేదు.

శారీరకంగా శక్తి హీనత కల్గినట్లయితే దైనందిన జీవితంలోని ఒత్తిడిని, శ్రమను తట్టుకునే శక్తినే మనిషి కోల్పోతాడు.

---

సి. వి. సర్వేశ్వర శర్మ, ప్రెసిడెంట్, కోనసీమ సైన్సు పరిషత్, అమలాపురం.

**ఏమి చెయ్యాలి ?**

ఇన్‌సోమ్నియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దైనందిన జీవిత శైలిలో చిన్న చిన్న మార్పులు చేసుకుంటే మంచి నిద్ర పడుతుంది. అసలు ఎందుకు నిద్ర పట్టడం లేదు? అనే అంశంపై ముందు వైద్యుని సంప్రదించాలి.

ఆర్థరయిటీస్, మానసిక సమస్యలయిన డిప్రెషన్, వంటివి నిద్రలేమికి అసలు కారణాలు కావచ్చు. వాటి విషయం తేల్చుకోవాలి. అవే కారణాలయితే వాటికి వైద్యుని సలహా మేర చికిత్స చేయించుకుంటే నిద్ర లేమి ఉండదు.

నిద్ర లేమి తప్ప ఇతరత్రా ఏ సమస్యలు లేవనుకుందాం. అప్పుడు ఏమి చెయ్యాలి?

నిద్రకు ఉపక్రమించే ఒకగంట లేదా రెండు గంటల ముందు బాగా రిలాక్స్ కావాలి. ఈ సమయంలో చేయాల్సిన పనుల గురించి ఎక్కువగా ఆలోచించకూడదు. ఆవేశ పరచే లేదా ఉద్రేకపరచే పనులు కూడా ఈ టైములో చేయకూడదు.

టి.వి. లో హింసాపూరిత లేదా ఉద్వేగ భరితమైన సన్నివేశాలు చూపిస్తూ ఉంటే టి.వి. స్విచ్ ఆపు చేయాలి. మీకు ఇష్టమైన వ్యాయామం ఏదైనా ఉంటే దానిని చేయవచ్చు.

శరీరంలో ఉండే జీవగడియారం మంచి పని తీరులో ఉండేటట్లు చేసుకోవాలి. ప్రతిదినం ఒక నియమిత సమయంలో నిద్రకు ఉపక్రమించే నియమావళి అలవరచుకోవాలి.

నియమిత సమయానికి ముందుగా నిద్రముంచుకు వస్తూంటే మీ సమయం వరకూ మెళుకువగా ఉండే ప్రయత్నం వాంఛనీయం. నిద్ర సమయానికి నిద్ర రాక పోతే నిద్ర వచ్చేవరకు మెళుకువగా ఉండాలి.

**నిద్రించే సమయం మార్పు చేసుకోవాలి**

నిద్ర నిర్ణీత సమయానికి కాక వేరే సమయానికి ప్రతి రోజూ వస్తూంటే మీరు నిద్రించే నిర్ణీత సమయాన్ని నిద్ర వచ్చే సమయానికి మార్చుకుంటే ఉత్తమం. కాకపోతే ఆ సమయం నిద్రకుపక్రమించే సమయంగా ఉండాలి.

మంచం మీద నిద్రించేందుకు పరుండిన యిర్వై లేదా ముప్ఫయి నిముషాల్లో నిద్ర రాకపోతే ప్రక్క గదిలోకి వెళ్ళి ఏదైనా పుస్తకం నిద్ర వచ్చే వరకు చదవాలి.

మంచం మీద పడుకున్న తరువాత నిద్ర పట్టి మెళుకువ వచ్చి మళ్ళీ నిద్ర పట్టక పోతే ఎలా? అప్పుడుకూడా రీడింగ్ రూమ్‌లో కూర్చుని నిద్ర వచ్చే వరకు పుస్తకం చదవాలి. ఇలా తరచు చేస్తూ ఉంటే నిద్ర లేమి తగ్గుతుంది.

ప్రతి దినం మీరు ఎప్పుడు నిద్రకు ఉపక్రమించినా నిద్ర నుండి మెళుకువకు వచ్చి మంచం దిగి బయటకు వచ్చే సమయం ఒక ఖచ్చితమైన సమయంగా నిర్ణయించుకోవాలి. ఉదయం ఇలా ఒక నియమిత సమయాన్ని నిద్ర నుండి మేల్కొనడానికి ఎంచుకుని పాటిస్తే శరీరంలోని జీవగడియారం పనితీరు బాగుంటుంది.

పైగా రాత్రి మీరు అనుకున్న సమయానికి నిద్ర వస్తుంది. మధ్యాహ్న సమయంలో చిన్న కునుకుకూడా పడుతుంది. మధ్యాహ్నం కునుకు యిరవై లేదా ముప్పయి నిముషాలకు మించి ఉండకూడదు.

**వ్యాయామం తప్పక చేయాలి**

క్రమం తప్పకుండా రోజూ వ్యాయామం చేయాలి. ఇది మంచి నిద్రకు సహకరిస్తుంది. వ్యాయామం నిద్ర సమయానికి రెండు మూడు గంటల ముందు చేయకూడదు. ప్రతి దినం కనీసం అరగంటకు మించి వ్యాయామం చేయడం ఉత్తమం.

పడుకునే సమయానికి ముందు వ్యాయామం చేస్తే నిద్రా భంగం అయ్యే ప్రమదాం ఉంటుంది. సుఖనిద్రకు పాటించాల్సిన కొన్ని విషయాలు.

* పడక గది చల్లగా ఉండేటట్లు చేసుకోవాలి. చలివేస్తే కప్పుకునేందుకు దుప్పటి మంచం మీద అందుబాటులో ఉంచుకోవాలి.
* వేడినీటి స్నానం నిద్ర సమయానికి అరగంట ముందు చేయడం మంచిది.
* మంచం మీద పడుకునే ముందు తేలిక ఆహారం పాలు లేదా బిస్కట్లు తీసుకోవాలి.
* నిద్రించేముందు మీకు నచ్చిన నిద్రకు ఉపకరిణి అంటే చక్కని సంగీతం లేదా పాట వంటివాటిని వినాలి.
* నిద్రకు ఉపక్రమించే ముందు తాళాలన్నీ సరిగా వేసుకున్నదీ లేనిది చెక్ చేసుకోవడం మరుసటి రోజు దుస్తులు రడీ చేసుకోవడం వంటి పనులు పూర్తి చేసుకోవాలి.

**చేయకూడని పనులు**

* రాత్రి భోజనం అనంతరం ఆల్కహాలు వంటి పానీయాలు సేవించరాదు. ఆల్కహాల్ నిద్రను ప్రేరేపించవచ్చు కాని నిలకడ లేని నిద్ర వస్తుంది.
* రాత్రిపొద్దుపోయాక కాఫీ , టీ, కోలాలవంటి వాటిని తాగకూడదు. కెఫీన్‌కు సున్నితంగా ఉండేవారు వీటిని ముట్టకూడదు.
* రాత్రి పొగతాగడం నిషేధించుకోవాలి. ఇది నిద్రలేమికి సహకారి.
* రాత్రి మితిమీరి భుజించకూడదు.
* మీ పడకగది నిద్ర, సెక్సుకు తప్ప ఇతర పనులకు కేటాయించ కూడదు.
* నిద్రరావడం లేదని వర్రీ పడకూడదు. అసలు నిద్రకుపక్రమించే ముందు దేని గురించి వర్రీ పడకూడదు.

నిద్రమాత్రలతో పని లేకుండా చిన్న చిన్న చిట్కాలు పాటించడం వల్ల సుఖనిద్ర మీ చేరువవుతుందని గుర్తుంచుకోండి.

page

A Sheet from the Diary of the eminent Telugu Sri Pattabhi ~~Rami Reddy~~ poet and ~~r~~ film director,

APPOINTMENTS

8:00 ~~I am thankful to Sri Pasupuleti Poorna Chandra Rao for giving his book of poems "Let me Confess" as dedication to me.~~

9:00

10:00

ఈ పుస్తకం "Let me confess" నాకు అంకితం

11:00 చేసిన శ్రీ పసుపులేటి పూర్ణచంద్రరావు గారికి [illegible]

Thanks.

12:00 My Notes

[illegible]

1:00 [illegible]

[illegible]

2:00 [illegible]

[illegible] Let me confess [illegible]

3:00 [illegible]

4:00 I congratulate my friend Sri Pasupuleti Poorna Chandra Rao on his

5:00 uniquely original Book of poetry. Nothing like this has appeared so far not only

6:00 in Telugu literature but even in other literatures elsewhere in the world.

MEMORANDA

~~found~~ Elements of Tantra has of course found a place here and there in world literature in avant-garde films of ~~[illegible] Paintings~~ Cocteau & Bunuel, in paintings of Dali and Picasso

| April 2001 | S | M | T | W | T | F | S | S | M | T | W | T | F | S | S | M | T | W | T | F | S | S | M | T | W | T | F | S | S | M | - |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 | - |



APPOINTMENTS

8:00 Surrealism & Dadaism are only a part of Tantra, But as a discipline and

9:00 Philosophy, it is (only) in India and Tibet in the Hindu and Buddhist

10:00 thought that the Tantra has been systematically ~~that Tantra has been~~

11:00

## సందర్భంగా, ప్రసిద్ధ రచయిత పఠాభి డైరీలో ఒక పుట

11:00 "has been explored and established.
"Let me confess" is a perfect example of Tantric thought

12:00 Recently, when I visited Kamakhya Temple in Gauhati, Assam where my
1:00 Son Konarak and his wife Kirtana were making a documentary on the Tantric
2:00 Rituals, I came to know that there is a book in Sanskrit called
3:00 श्री कौलज्ञाननिर्णय which is a classic on Tantric philosophy and practice. But
4:00 strangely this book has remained only in Sanskrit and not translated into
5:00 any of the Indian languages. I wonder why!
6:00 Tantra art has flourished for long

**25** Sunday • in India and Tibet both in painting and sculpture. But in literature it has been rare. Though "Soundarya Lahari" of Adi Sankara is an extraordinarily beautiful poem. Mention should also be made of the Mention

February 2001

**2001** **March**

Week 13 Monday **26**

APPOINTMENTS

8:00 "Song of Songs" in the Bible which has some elements of Tantric Thought.
9:00
Sri Poornachandra Rao has
10:00 struck a new and bold path in Telugu literature, though it is an
11:00 old and forbidden path. He has really succeeded in doing this. I
12:00 congratulate him once again for his bravery and poetic skill and
1:00 honesty.
I am grateful to all of you
2:00 for giving me the opportunity to meet you all.
3:00

# స్వగతం నుండి స్వగతానికి

- డా॥ యు.ఎ. నరసింహమూర్తి

(గత సంచిక తరువాయి)

లుబ్ధావధాన్ల స్వగతాలు నోరు కట్టుకోలేక వెళ్ల బోసుకున్నవి కావు. తనలోకి తాను చొచ్చుకుని పోయి తన ఆత్మను తాను దొలుచుకున్నవి. ఆ మాటల తీరే వేరు. అందులో ఉన్న విషయమే వేరు. అవి ఉద్రేకాల వెల్లువలే కాని ఆలోచనల పోగులు కావు. గిరీశం మాటల్లో అతని తెలివి అంతా కనిపిస్తుంది. లుబ్ధావధాన్ల మాటల్లో అతని అనుభూతులన్నీ వెల్లడౌతాయి. ప్రేక్షకుల వేపు కన్నెత్తి చూసినట్టుకూడా కనిపించవు. ఆత్మావలోకనం కనిపిస్తుంది. ఔగాముల విచారం కనిపిస్తుంది.

వివరణాత్మక స్వగతాలలో ప్రతినాయక స్వగతాలను కూడ చెప్పుకోవాలి. ప్రతి నాయకుని శీలమంతా వెల్లడి చేయడానికి ఈ స్వగతాలు ఉపయోగపడతాయి. మృచ్ఛకటికంలో శకారుడి స్వగతాలలో ఈ లక్షణం కనిపిస్తుంది. కన్యాశుల్కంలో శకారుడు రామప్పంతులే. కన్యాశుల్కం 5వ అంకం 5వ రంగంలో రామప్పంతులు స్వగతం ఒకటుంది. ''కంటె పోయిందంటే మూడు రూపాయలా చేతిలో పెడతాడు! (విరసంగా నవ్వును) వీడి తాళం పడతాను'' అంటూ హెడ్ కానిస్టేబులు మీద ''యినస్పెక్టరుకి వొకటి, తాసిల్దారుకి వొకటి, ఆకాశరామన్న అర్జీలు పంపుతాను'' అంటూ తన శీలాన్ని వెల్లడించుకున్నాడు రామప్పంతులు. ఆ స్వగతమంతా అభివ్యక్త స్వగతమే. ఇక్కడ రామప్పంతులు చాలా చిక్కుల్లో పడ్డాడు. ఆరాత్రి ఏం చెయ్యాలో ఎక్కడుండాలో అతనికి పాలు పోలేదు. మాయగుంట ఏమయింది? కంటె ఏమయింది? మధురవాణి దగ్గరకు మళ్లీ వెళ్లడమెలా? రహస్య భేదనానికి మార్గాలేమిటి? ఈ ప్రశ్నలు వాటి సమాధానాలతో రామప్పంతులు శీలంతోపాటు, అతని మనస్థితి కూడా ఈ స్వగతంలో అద్భుతంగా వెల్లడయింది. ఇలాంటి స్వగతాలు షేక్స్పియరు నాటకాలలోనూ కనిపిస్తాయి.

ఉత్తర రామ చరిత్రలో సీత, ముద్రారాక్షసంలో చందనదాసు వంటి పాత్రలు ఆత్మహత్యను గూర్చి తమలో తాము ఆలోచించుకున్న స్వగతాలున్నాయి. షేక్స్పియరు నాటకాలలో ఇలాంటివి మనకు కనిపిస్తున్నాయి. కన్యాశుల్కంలో ఆత్మహత్యా సందర్భానికి తగిన స్వగతాలు లేక పోయినా లుబ్ధావధాన్ల స్వగతాలలో అంతటి గాఢ పరితాపం మాత్రం కనిపిస్తోంది. పంచమాంకం చివరలోనున్న రామప్పంతులు స్వగతం దయనీయమైనదైనా పాత్రశీలాన్ని బట్టి సహృదయుడు పాత్రతో సహానుభూతిని పొందలేక కొంచెం ఎడంగానే ఉంటాడు. ఐనా రసాభివ్యక్తికి గానీ, రసానుభవానికి లోటు కలగదు.

కన్యాశుల్కం నాటకంలో ఒక ఉత్తరం చదివే దృశ్యం ఉంది. నాటకాల్లో ఉత్తరాలు ఇటు ప్రాచీన భారతీయ నాటక కర్తలకు గాని, అటు పాశ్చాత్య నాటక కర్తలకు గాని కొత్తకాదు. షేక్స్పియరు

---

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేసి, అక్కడే యు.జి.సి. ఎమిరిటస్ రీసెర్చి ఫెలోగా ఉంటున్నారు.

మేక్‌బెత్, సెంటిలిన వంటి నాటకాలలో ఉత్తరాలు మనకు కనిపిస్తాయి. అంతేకాదు ఉత్తరాలకు సంబంధించిన స్వగతాలు, హాస్య కల్పనలు కూడా కనిపిస్తాయి. ఈ విషయంలో గురజాడ షేక్స్పియరు నాటకాలతో ప్రభావితుడైనట్లు కనిపిస్తుంది. కన్యాశుల్కంలో గిరీశం ఉత్తరానికి చాలా ప్రాధాన్యముంది. దాదాపుగా అది ముద్రారాక్షసంలోని ఉత్తరమంత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నదని అనవచ్చును. ఆ ఉత్తరాన్ని ముందు రామప్పంతులు తనలో తాను చదువుకోవడం ఆరంభించి మధురవాణి అడిగిన మీదట బయటకు చదవడం కొనసాగించేడు. అందుచేత గురజాడ కన్యాశుల్కంలో లేఖా స్వగతాన్ని కూడా ప్రవేశపెట్టినట్లు భావించాలి.

అభిజ్ఞాన శాకుంతలం చతుర్థాంకం ఆరంభంలో కణ్వశిష్యుడు ప్రవేశించి కణ్వుడు ప్రవాసం నుండి తిరిగివచ్చినట్లు, ఆయన నిర్వహించే ప్రాతఃకాల అగ్ని కార్యానికి వేళ అయినదీ లేనిదీ తెలుసుకున్నట్లు సంభాషిస్తాడు. ఈ సమయంలో వేళను నిరూపించడానికి చంద్రాస్తమయ, సూర్యోదయ వర్ణనలు చేస్తాడు. పూర్వ నాటకాలలో స్వగతాలలో ఇటువంటి వర్ణనలు చేసే వాడుక ఉంది. పాశ్చాత్య నాటకాలలోను, షేక్స్పియరు నాటకాలలోను కూడా ఈ పద్ధతి కనిపిస్తుంది. గురజాడ ఏడంకాలు, ముప్పై ఏడు దృశ్యాలతో కూడిన పెద్ద నాటకం రాసినా ఎక్కడా వర్ణనలకు చోటునివ్వలేదు. ఆ పద్ధతి ఆయనకు సమ్మతం కానట్లు కనిపిస్తుంది. నాటకంలోని వాతావరణానికి భిన్నమైన సౌందర్య కల్పనలకు ఆయన వ్యతిరేకి. గిరీశం స్వగతాలలో బుచ్చమ్మ వర్ణన, సమకాలీన వాతావరణ వివరణ కొంత కనిపిస్తుంది. పాత సంప్రదాయాలను పునఃప్రతిష్ఠించడం గురజాడ అభిమతం కాదు.

అభిజ్ఞాన శాకుంతలంలో కణ్వ శిష్యుడు నిష్క్రమించకుండానే అనసూయ రంగస్థలం మీద ప్రవేశిస్తుంది. ఈ ప్రవేశాన్ని కాళిదాసు ''ప్రవిశ్య పటాక్షేపేణ'' అని సూచిస్తాడు. ''పటాక్షేపం'' అంటే ''తెరను తొలగించుకుంటూ రావడం'' (యవనికాపనోదనము) అని చెప్తూ కాటయ వేమారెడ్డి ''హర్ష శోకాది సంభ్రమ యుక్తస్య పాత్రస్య ప్రవేశః పటాక్షేపేణ క్రియత ఇతి కవి వ్యవహారః'' అని వివరిస్తాడు. ఈ విధంగా రంగస్థల సంబంధమైన సూక్ష్మాతిసూక్ష్మమైన అంశాలను స్పష్టంగా నిర్దేశించడానికి ప్రాచీన భారతీయ నాట్యశాస్త్ర వివరణ కర్తలు నాటికీ నేటికీ పాశ్చాత్య నాటక కళా మర్మజ్ఞుల కంటే ఒకడుగు ముందుగానే ఉన్నారని ఘంటాపథంగా చెప్పవచ్చును. ఈ ప్రవేశ సందర్భంలో అనసూయ మన స్థితి స్వగతానికి ఉన్ముఖంగా ఉంది. దుష్యంతుడు శకుంతలకు అన్యాయం చేసాడని ఆమెకు నిర్ధారితమయింది. కణ్వ శిష్యుని ప్రకృతి వర్ణనలోని వ్యంగ్యార్థం ఆమె మనోగతాన్ని దృఢ పరచింది. కణ్వ శిష్యుని నిర్గమనాన్ని కూడా ఆమె గమనించలేదు. రంగస్థలం శూన్యంగా ఉంది. అప్పటికింకా ప్రియంవద ప్రవేశించలేదు. ఆ శూన్యాన్ని అనసూయ స్వగతం కనబడకుండా చేసింది. ఇలా ఒక పాత్ర నిష్క్రమించి ఇంకొక పాత్ర ప్రవేశించడానికి ఉపయోగపడే స్వగతాలను అనుసంధాన స్వగతాలు **(Link soliloquies)** అని అంటారు. ఇవి చాలా చిన్నవిగా ఉంటాయి. సాధారణంగా ఒక వాక్యం, రెండు వాక్యాలలో తేలిపోతాయి. ఒక్కొక్కప్పుడివి పద్య, గేయ రూపాలలో కూడా ఉండవచ్చును. షేక్స్పియరు హేమ్లెట్ **(IV, 5, 16-20)**, జూలియస్ సీజర్

(II, I 229, 233, IV, 3, 267-274) వంటి నాటకాలలో పద్య రూపంలో ఉన్న అనుసంధాన స్వగతాలు కనిపిస్తాయి.

కన్యాశుల్కం ప్రథమాంకం ప్రథమ రంగంలో గిరీశంతో మాటలు ముగిసిన తర్వాత వెంకటేశం నిష్క్రమిస్తాడు. ఆ తర్వాత ఫోటోగ్రాపు పంతులు బంట్రోతు ప్రవేశిస్తాడు. ఈ నిష్క్రమణ ప్రవేశాల మధ్యనున్న అంతరాన్ని గిరీశం తన స్వగతంతో కలుపుతాడు. ''ఈ వ్యవహారమొహటి ఫైనలైంది. ఈ రాత్రి మధురవాణికి పార్టింగ్ వొకటి యివ్వందే పోకూడదు.

(రాగ వరసతో పాడును)
నీవైటు నాడిలైటు - నిన్ను మిన్న - కానకున్న
క్వైటు రెచడ్ ప్లైటు - మూనులేని నైటు''

ఈ పాట, భాష, భావం అన్నీ సహృదయులు పాత్ర నిష్క్రమణ - ప్రవేశం మధ్యనున్న అంతరాన్ని విస్మరింపజేసేవే. రెండవ రంగంలో గిరీశం వస్తూన్నప్పుడు మధురవాణి తలుపు తియ్యడానికి వెళ్లినప్పుడు రంగస్థలం క్రియాశూన్యంగా ఉండకుండా రామప్పంతులు ''వేళగాని వేళొచ్చాడు గాడిదకొడుకు, తంతాడు కాబోలు, యేమిటి సాధనం, మంచంకింద దూరదాం'' అని తనలో తాను అనుకోవడం కూడా అనుసంధాన స్వగతమే. పాటల విషయంలో షేక్స్పియరు ప్రభావం కనిపించినా అనుసంధాన స్వగతాలన్నీ ఆయన ప్రభావంతో వచ్చినవనిగానీ, పాశ్చాత్య నాటక ప్రభావంతో వచ్చినవని గాని చెప్పవలసిన పనిలేదు. ప్రపంచంలో ఏ నాటకంలోనూ లేనన్ని స్వగతాలు ముద్రారాక్షసంలో ఉన్నాయి. అసలు దానిని స్వగతాల నాటకం అనవచ్చును. అందులోని కుట్రలు - కుయుక్తులతో నిండిన రాజకీయ వాతావరణం కారణంగా ఏ పాత్రా తనలో తాను ఒకసారిగా మాట్లాడుకోకుండా, ఎదుటిపాత్రతో మాట్లాడదు.

ప్రవేశ నిష్క్రమణ స్వగతాలు తప్ప మిగిలిన స్వగతాలన్నీ ఒక విధంగా అనుసంధాన స్వగతాలేనని అనవచ్చును. కాని ఒకటి రెండు వాక్యాలలో నిష్క్రమణ ప్రవేశాల మధ్య నుండే విలంబాన్ని పూరించే స్వగతాన్ని అనుసంధాన స్వగతమని వ్యవహరిస్తారు. కాని అది శుష్కమైన సంభాషణ కాకూడదు. మొదటి రంగంలోని గిరీశం అనుసంధాన స్వగతం మధురవాణితో అతనికున్న సాన్నిహిత్యాన్ని, మధురవాణి సమ్మోహకశక్తిని తన ప్రవేశ స్వగతంలో మధురవాణిని స్పృశించి విడచిన గిరీశం ''మధురవాణిని వదలడమంటే మనస్కరించకుండా వుంది'' అనడంలోని తాత్పర్యమేమిటో ఈ అనుసంధాన స్వగతంలో బలపడి, పాటోగ్రాపు పంతులు బంట్రోతు తెచ్చిన ''యాడాది కిందట మీరూ సాన్లీ కలిసి యేసుకున్న పాటో గ్రాపుల కరీదు'' అన్న వృత్తాంతంతో సహృదయుల హృదయాల్లో స్థాపితమౌతుంది. ఇదే గిరీశం తృతీయాంకం నాల్గవ రంగంలోని వివరణాత్మక స్వగతంలో ''యిన్నాళ్లు మధురవాణి వల్లో పడి యెలా యాస్‌ని అయిపోయినానో నాకు నామట్టుకే ఆశ్చర్యంగా వుంది! మధురవాణికీ యీ మనిషికీ కంపారిజన్ వున్నదా! అది రంగువేసిన గాజుపూస యిది ప్యూర్ డైమండ్'' అంటాడు. వరుసగా మూడు స్వగతాలలో స్వగతానికి స్వగతానికి మధ్య

గిరీశం మానసిక పరిణామం ఎలా ఉందో, నాటక నిర్మాణం ఎలా కొనసాగిందో, ఇతివృత్తంలో వాటి స్థానం ఎలా బిగుసుకు పోయిందో మనం గమనించ వచ్చును. పాత్ర స్వభావోన్మీలనంలో, ఇతివృత్త సంఘటనంలో, నాటకీయ నిర్వహణలో ఒక క్రమ పరిణతిని, బిగువును సాధించడానికి నిపుణుడైన నాటకకర్త స్వగతాన్ని పొందికగా ఎలా ఉపయోగించగలడో గురజాడ కన్యాశుల్కంలో నిరూపించేడు. అనుసంధాన స్వగతంలో, వివరణాత్మక స్వగతంలో, నిష్క్రమణ స్వగతంలో ఆయన ఉపయోగించిన పాటల తుంటలు గిరీశం శృంగార చేష్టలకు ప్రతీకలుగా కనిపిస్తాయి.

"The comic link is a veriety Shakespeare frequently employs" (S.S. P. 84) అంటూ Morris Leroy Arnold, Henry IV Merry Wives, Measure for Measureల నుండి ఉదాహరణలు చూపించారు. ఇలాంటివి కన్యాశుల్కంలో కనిపిస్తాయి. ప్రథమార్థం రెండవ రంగంలో మధురవాణి ''రామ'' అనగానే మంచంకింది రామప్పంతులు ''చచ్చాన్రా, పేరు చెప్పేసింది'', అని తనలో తాను అనుకుంటాడు. మధురవాణి ''రామరామ ఒహరు చెప్పేదేమిటి లోకమంతా కోడై కూస్తుంటేను'' అని అనడంతో ఆ ప్రమాదం తప్పి ప్రేక్షకుల్లో హాస్యం మిగిలిపోయింది. పంచమాంకం ఆఖరి దృశ్యంలోను దాసరి రామప్పంతుల్ని వెంటబెట్టి పాట పాడినప్పుడు, షష్ఠాంకం ప్రథమ దృశ్యంలో దాసరి అగ్ని హోత్రుడికి లుబ్ధావధాన్ల ఇంటిని చూపించినప్పుడు ఉండేవి సంభాషణలు కాక అనుసంధాన స్వగతాలుగా మారి హాస్య స్ఫోరకాలుగా ఉన్నాయి. గురజాడ ఈ అనుసంధాన స్వగతాన్ని చాలా పొదుపుగా ఉపయోగించాడు.

రంగస్థలం నుండి చివరి పాత్ర నిష్క్రమించడానికి ఉపయోగపడే సాధనాలలో ''నిష్క్రమణ స్వగతం'' (Exit Soliloquies) ఒకటి. ఒక్కొక్కప్పుడు ఇది ఉపన్యాస రూపంగా ఉండవచ్చును. కాని సాధారణంగా క్లుప్తంగా ఒకటి, రెండు వాక్యాలలో ఉంటుంది. భారతీయ నాటకాలలో అంకాంతంలో స్వగతాలున్న సందర్భాలు కనిపిస్తాయి. కాని నాటకాంతంలో స్వగతాలుండవు. భరతవాక్యంతో నాటకం ముగియడం ఒక సంప్రదాయం. గురజాడ తన నాటక సంవిధానంలో మైకేల్ మధుసూదన్ దత్ వంటి వారి మార్గాన్ని అనుసరించిన కారణంగా భరతవాక్య పద్ధతిని విడచి కొత్త తోవ తొక్కాడు. భరతవాక్యం ఎప్పుడూ ముందు కొంత నాటకాన్ని సూచిస్తుంది. గురజాడ ఎంచుకున్న సమస్యలకు కన్యాశుల్కంతోనే ముగింపు చూపించడం సాధ్యం కాదు. ఆయన తన నాటకంలో సంఘ వ్యతిరేక శక్తుల, కుహనా సంస్కారుల ఆట కట్టించే మార్గాలను చూడదలచుకున్నాడు. వివేకం గల వ్యక్తులు సామాజిక న్యాయ సాధన కోసం ఏతోవ తొక్కాలి? అనే విషయంలో ఒక చైతన్యాన్ని కల్పించాలనుకున్నాడు. అందుకే తన నాటకాన్ని భరత వాక్యంతో కాకుండా ఒక చిన్న స్వగతంతో ముగించాడు. షేక్స్పియర్ నాటకాలలో నిష్క్రమణ స్వగతంలో సాధారణంగా ఒక ద్విపద (Complet) ఉంటుంది. ఒకటి లేక రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు ద్విపదలున్న (Complets) సందర్భాలు కూడా కనిపిస్తాయి. వచనంలో నిష్క్రమణ స్వగతం కనపడడం కూడా ఎప్పుడైనా కనిపిస్తుంది. ఒక వాక్యంతోనో, వాక్యాంశంతోనో నిష్క్రమణ స్వగతాన్ని సూచించడం అరుదు. నిష్క్రమణ స్వగతం కొంచెం పెద్దదైనప్పుడు దానినొక Tag తో పూర్తి

చేయడం అప్పుడప్పుడు కనిపిస్తుంది. Tag అంటే Phrose or sentence ofter quoted అని అర్థం చెప్తారు. గురజాడ కన్యాశుల్కంలో మొట్టమొదటి ప్రవేశ స్వగతంలోనే ఒక Tag ను ఉపయోగించి నాటక గమనం పట్ల గిరీశం పాత్రోన్మీలనం పట్ల ప్రేక్షకులకు అమితమైన ఆసక్తిని కలిగించేడు. ''అట్నుంచి నరుక్కు రమ్మన్నాడు'' అన్నదే ఆ Tag. నూరేళ్ల దాటినా ఆ వాక్యం సజీవంగా ఉంది. తెలుగు వాళ్ళున్నంతకాలం ఉంటుంది. దాని వెనుకనున్న గాథ తెలియని వాళ్ళకు కూడా అది ఆసక్తిని కలిగించేదిగా ఉండడం ఆశ్చర్యకరం. బౌద్ధమతాన్ని వ్యతిరేకించిన రాజు బౌద్ధుల నందరను వరుసగా నిలబెట్టి, కత్తితో వరుసమీద నరకమని ఆజ్ఞాపించాడు. అమర నిఘంటుకర్త ఆవరుసలో మొదటి వాడు. భటులు తన దగ్గరకు నరకడానికి వస్తే తన దగ్గర నుండి కాక రెండవ చివరనుండి నరకడం ప్రారంభించమన్నాడు. భటులు అతని కోరిక మన్నించి రెండవవేపు నుండి బౌద్ధులను నరుక్కుంటూ తన దాకా వచ్చేలోపల ఈ పండితుడు 'నామలింగాను శాసనము' అనే అద్భుతమైన నిఘంటువును సంస్కృత శ్లోకాలలో రచించేడు. అట్నుంచి నరుక్కు రావడం వలన చిక్కిన స్వల్ప కాల వ్యవధిలో ఆయన ఇంత గొప్ప పనిని సాధించగలగడంతో ఆ మాట లోకంలో నిలిచిపోయింది. గిరీశం ఆ గాథను తన వాక్యంలో ప్రయోగించి కృష్ణారాయపురంలో సెలవులు గడపడానికి లభించిన వ్యవధిలో తన భవిష్యత్ప్రణాళికను తీర్చిదిద్దుకోవాలనుకున్నాడు.

అనుసంధాన స్వగతంలాగే నిష్క్రమణ స్వగతం కూడా పరోక్షంలో ఉన్నవారిని లేదా మరణించిన వారిని ఉద్దేశించి చేసే లఘు వ్యాఖ్య రూపంలో ఒక్కొక్కప్పుడు కనిపిస్తుంది. ఈ సందర్భంలో నాటకీయ పరిభాషలో ఉపయోగించే GAG అనే మాటను గూర్చి ప్రస్తావించవలసిన అవసరం ఉంది.

"Sometimes the conclusion is brought about in a comical fashion, by what is known in the Vernacular of the modern stage as the "gag". (The Soliloquies of Shakespeare, Morris Leroy Arnold, Page 89).

షేక్స్పియర్ నాటకాలలో ఇలాంటి వాక్యాలు కనిపిస్తాయి. కన్యాశుల్కంలో కూడా అగ్ని హోత్రావధాన్ల నిష్క్రమణ స్వగతాలలో ఇలాంటి వాక్యాలు కనిపిస్తాయి.

వీడి శ్రాద్ధం చెట్టు కింద బెట్టా; తోవ యిటా? అటా? (6వ అంకము, మొదటి స్థలము)

అగ్నిహో:- వీడికి వెఱ్ఱి కాబోలు! (6వ. అంకము, 7వ స్థలము).

అగ్నిహోత్రావధాన్ల సంభాషణలలోనే కాక, కన్యాశుల్కం నాటకం ముగింపే, ''డామిట్! కథ అడ్డం తిరిగింది!'' అన్న "gag" తో జరిగిందని చెప్పవచ్చును.

ఇటువంటి వాక్యాలు పలికేటప్పుడు నటుడు రంగస్థలం మీద ఇంక తనకు ఏమీ చోటు మిగలలేదన్నట్లుగా భావ ప్రకటన చేస్తూ ప్రేక్షకుల నుద్దేశించి సంభాషిస్తున్నట్లుగా నటిస్తాడు. ఇటువంటి వాక్యాలను సంఘటించడం మధ్యయుగాల నాటి నాటకాలలోనే కాక ఆధునిక నాటకాలలో

కూడా కనిపిస్తుంది. ఇబ్సన్ రాసిన "Doll's House" అనే నాటకంలో మొదటి, చివరి అంకాలను ముగించే స్వల్ప వాక్యాలు సాక్ష్యాలుగా కనిపిస్తాయి. ఇబ్సన్ ఈ సందర్భాలలో సంఘటించిన ముగింపు వాక్యాలు నిష్క్రమణ స్వగతాల వంటివే. కళాత్మకమైన ముగింపును సాధించటం కోసం ఇబ్సన్ ఈ విధానాన్ని అనుసరించినట్లు విమర్శకులు భావిస్తారు. ఎలిజబెత్ కాలపు నాటకాలనే కాక బెర్నార్డ్ షా, ఇబ్సన్ వంటి రచయితల ఆధునిక నాటకాలను కూడా అధ్యయనం చేసిన గురజాడ కన్యాశుల్కానికి ఒక కళాత్మకమైన ముగింపును సాధించే నిమిత్తం, ఆ నాటకాన్ని స్వగతం నుండి స్వగతం దాకా, Tag నుండి gag దాకా నడిపించుకొని పోయాడు. Tag అనేది సాధారణంగా అతఃపూర్వమే లోకంలో స్థిరపడిన భావమై ఉంటుంది. ''అటు నుంచి నరుక్కు రమ్మన్నాడు'' అన్ననానుడి ఆవిధమైనదే. గిరీశం వంటి కుహనా సంస్కారి లోకాన్ని మభ్య పెట్టడానికి, స్వలాభాన్ని సాధించుకోడానికి చేసే ప్రయత్నం సూర్యాస్తమయ సమయంలో చీకట్లు ముసురుకొనే వేళ ఆరంభమయింది. క్రమంగా ఆ చీకటి ఎలా విస్తరిస్తుందో కన్యాశుల్కం నాటకంలోని వివిధ దృశ్యాల వెనుక దాగిన గాఢమైన భీభత్సం వెల్లడిస్తుంది. ఆఖరి దృశ్యంలో బాగా రాత్రి గడచిన తరువాత, సౌజన్యారావు పంతులు ఇంట్లో నడచిన సుదీర్ఘ చర్చ అర్ధరాత్రి దాకా కొనసాగిందని మనం ఊహించుకొనే అవకాశముంది. దాని పర్యవసానంగా గిరీశంలోని ఆషాఢభూతి లక్షణమంతా వెల్లడైంది. అంటే కుహనా సంస్కారుల ప్రయత్నాలన్నీ ఉదారవాదులలో పెల్లుబికిన నూతన, సాంఘిక, చైతన్య తేజంతో వెల వెల పోయినట్లు అయిందన్నమాట. అంతటితో వాళ్ళ ఆట కట్టుబడే సన్నివేశం ఆరంభమయింది. అందుకే గిరీశం, ''డామిట్! కథ అడ్డం తిరిగింది!'' అనవలసి వచ్చింది. అంటే తాను అటునుంచి నరుక్కు వద్దాం అంటే, ఆ కొస ఏమీ చేతికి అందక, తిరిగి తాను ప్రారంభించిన చోటనే, తాను నిలబడవలసి వచ్చిందన్న మాట. '' ఈ ఊళ్లో ఇంక మన పప్పు ఉడకదన్నమాట'' అని గిరీశం మొదట్లో అనుకొన్న మాట నాటక సంవిధాన మంతటా కొనసాగి, చివరకు కుహనా సంస్కారులకు ఏ ఊళ్లోనైనా, ఇకపైన ఎప్పుడైనా, ''పప్పు ఉడకదు'' అనే నాటకీయ వ్యంగ్యాన్ని కళాత్మకంగా సూచించడం కోసమే కన్యాశుల్కాన్ని స్వగతం నుండి స్వగతానికి నడిపించాడు గురజాడ.

**ఆధార గ్రంథములు:**


1) నాట్య శాస్త్రము - (అను) P.S.R. అప్పారావు.

2) తెలుగు నాటక వికాసము - P.S.R. అప్పారావు

3) రసార్ణవ సుధాకరము.

4) అభిజ్ఞాన శాకుంతల వ్యాఖ్య - కాటయ వేమారెడ్డి

5) The Soliloquies of Shakespeare - Morries Leroy Arnold, The Columbia University Press, 1911, New York.

6) The Indian Theatre - R.K. Yajnik, London George Allen & Unwin Ltd Museum Street.


(సమాప్తం)

# వేయి పడగల నీడన భావి భారతం!

- నరేష్ నున్నా

"God wishes that one should put aside all humanity when it is a question of striving for His glory" - *John Calvin.*

1992 డిసెంబర్ 6: బాబ్రీ మసీదు కూల్చివేత!

వేయి పడగల హైందవ నాగరాజు అనుయాయుల ప్రతాపంతో కూలిన బాబ్రీ మసీదు శకలాల నుంచి భారత ముస్లింలకు వినిపించిందొక హెచ్చరిక. రెండవ, లేదా అంతకంటే దిగువ శ్రేణి పౌరులుగా తప్ప, మెజారిటీ వర్గానికి సమాన హోదాలో బ్రతికే అవకాశం ఇక తమకు లేదన్నదే ప్రకాశకంగా వినిపించిన ఆ తొలి హెచ్చరిక సారాంశం. నిఘా వేసిన కన్నుల పహరా మధ్య, నిలవరించే చూపుల ప్రశ్నార్థకాల మధ్య తమ సామాజిక, రాజకీయ అస్తిత్వం బిక్కు-బిక్కుమని మనవలసిన దుస్థితిని నిస్సహాయంగా చూశారు వారు. ప్రతి నడకలో సంజాయిషీ, నడతలో జవాబుదారితనం ఉండాలని, డేగకళ్లతో 'అనుమానం' పొంచినప్పుడు తప్పని సరిగా తమ 'దేశభక్తి'ని నిరూపించుకొని మరీ తమ తలలు కాపాడుకోవాలని వారికి స్పష్టం చేసిందా రోజు.

సరిగ్గా ఓ దశాబ్దం తర్వాత......

2002 డిసెంబర్ 15:

'హిందూ రాజ్య ప్రయోగశాల' గుజరాత్‌లో బిజెపి విజయదుందుభి. ఆ జయశంఖారావంలో అల్ప సంఖ్యాక భారత ముస్లింలకు వినిపించిందొక తాజా హెచ్చరిక:

'ఈ రాజ్యంలో మీకు స్థానం లేదు. పౌర హక్కులు, పౌరసత్వపు హక్కులు, చివరికి జీవించే హక్కులు కూడా కేవలం అధికారిక కాగితాల మీద అవశేషాలు మాత్రమే. చావడం కోసం బ్రతికి ఉండటం మాత్రమే మీకు మిగిలిన ఏకైక హక్కు'.

ఈ చారిత్రక సందర్భంలో Mission of Hindutva తన అప్రతిహత యాత్రకు నాందిగా పాతిన గెలుపు జెండా సగర్వంగా రెపరెపలాడింది.

★ ★ ★

పై రెండు హెచ్చరికల మధ్య కచ్చితంగా పదేళ్లు. భారత కాలమాన పట్టికలో ఈ కాలం వైషమ్య నామ దశాబ్దం. మానవత్వం మచ్చుకైనా లేని మతోన్మాదమొక్కటే అంతిమ సత్యమై నిలిచిన క్షీణ దశాబ్దం. బాబ్రీ మసీదు విధ్వంసంతో ప్రారంభమైన fanatic శక్తుల విజృంభణ - బొంబాయి అల్లర్ల మీదుగా, కోయంబత్తూరు పేలుళ్ల మీదుగా, ఈద్గా మైదానాల మీదుగా, గుడి గోపురాల మీదుగా, ఉమ్మడి పౌరస్మృతుల మీదుగా, రాజ్యాంగ సవరణల మీదుగా, చరిత్ర పున్లేఖనాల మీదుగా,

---

నరేష్ నున్నా, ప్రముఖ పాత్రికేయుడు, ప్రస్తుతం విశాఖపట్టణంలో నివాసం.

కళా విధ్వంసాల మీదుగా, మతకల్లోలాల మీదుగా, మత మార్పిడుల వ్యతిరేకతల మీదుగా, మైనారిటీ మత గురువుల సజీవ దహనాల మీదుగా, మారణహోమాల మీదుగా, రామన్యాస్‌ల మీదుగా, రావణ కాష్ఠాల మీదుగా, గోధ్రాల మీదుగా, అక్షరధామ్‌ల మీదుగా, గుజరాత్ ఊచకోతల మీదుగా, ఉరికొయ్యల మీదుగా నిర్నిరోధంగా సాగిపోతూనే ఉంది.

అయితే, మతోన్మాదం (fanaticism) మన దేశానికే సంబంధించిన సమస్యా? కానేకాదు. ఎక్కడ లేదని?! 'ఇందుకలదందు లేదని' సందేహం లేకుండా భూగోళమంతా పరివ్యాప్తించింది మతోన్మాదం. 'జీహాద్'లతో, 'ఫత్వా'లతో రక్తపుటేర్లు పారించిన ఇస్లామీలు'. తాలిబన్లు; 'కన్నుకు కన్ను...... పన్నుకు పన్ను' అనే వారి సిద్ధాంతానికి సామ్యంగా పాలస్తీనీయుల్ని ఉచకోత కోస్తున్న జుడాయిక్ ఇజ్రేయిలీలు; దైవం పేరిట లక్షలాది సెర్బ్‌లను హతమార్చిన యుగస్లావియా Catholic Ustashisలు; Ulsterలో కొట్టుకు చచ్చిన కాథలిక్ - ప్రొటెస్టెంట్లు; లెబనాన్‌లో ఆరని కాథలిక్ - ముస్లిం కాష్ఠాలు; క్రిస్టియన్లు, ప్యూరిటన్లు జరిపిన క్రూసేడ్లు; పోప్ గ్రెగరీ IX నాటి Inquisitionలు; Spanish Inquisitionలు, హిట్లర్ Holocaustలు; ముసలి మతాల నుంచి, నిన్నా మొన్న Ron Habbard ద్వారా కళ్లు తెరిచిన Scientologyల వరకూ అంతటా, అందరిలోనూ కరుడు గట్టిన మతోన్మాదమే. కానీ, ఈ మతోన్మాదాలకీ, భారతదేశంలో హిందూ మతోన్మాదానికి చాలా తేడా ఉందనిపిస్తోంది. ప్రాచీన, మధ్యయుగాల హిందూ మతోన్మాదానికి కూడా నేటి ఆధునిక మతోన్మాదం భిన్నమైనదని నా అభిప్రాయం.

ఈ నా అభిప్రాయాన్ని సవివరంగా విస్తరించే ముందు 'వర్తమాన మత భారతా'న్ని గురించి ఒక్కసారి విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది.

★ ★ ★

భారతదేశంలో హిందు, ముస్లింలు సంఖ్యాపరంగా అసమవర్గాలు. ఇప్పుడే కాదు, ఎప్పుడైనా ఈ రెండు వర్గాల సంఖ్యా బలం ఒకటి కాదు. సమాన (లేదా దాదాపు సమాన) వర్గాలైనప్పుడు మాత్రమే 'సంఘర్షణ' ఉంటుంది. ఆ అనివార్య వాస్తవికతకి, 'సామరస్య జీవన' మనే ఆదర్శాన్ని అందుకోవడం ఒక లక్ష్యమవుతుంది. కానీ, సమాన వర్గాలు కాదు కనుక, సంఘర్షణలకు, సామరస్యానికీ కూడా తావు ఉండకూడదు. అల్ప సంఖ్యాక వర్గాల మీద మెజారిటీ వర్గం చెలాయించే పెత్తనం ఉంటుంది. దానిని వ్యతిరేకిస్తూ ఎంతో కొంత 'ప్రతిఘటన' కూడా ఉంటుంది. కానీ, గతంలోకి తొంగి చూస్తే, హిందూ, ముస్లింలు సామరస్యంగా బ్రతకడం భారత దేశంలో వైరుధ్యమైన వాతావరణానికి ఒక ఉదాహరణ. ఇరుగు పొరుగుగా ఉంటూనే, తమ తమ మత, సాంస్కృతిక జీవనాలలోకి పరస్పరం చొచ్చుకుపోకుండా, ప్రజాస్వామికంగా వారు బ్రతికారు. హిందూ మతం కులాలుగా చీలిపోవడమే హిందూ ముస్లిం సఖ్యతకు కారణం. అంటే, హిందువులు భిన్న సంస్కృతుల సమాహారం కనుక, కులాల వారీగా చూస్తే వారు కూడా మైనారిటీలే. కనుక ముస్లింలను ఒక మైనారిటీ వర్గంగా వేరు చేసి చూడటం జరగలేదు. హిందూ సంస్కృతిలో ఉన్న భిన్నమైన వర్గాల వల్ల, భారత ముస్లింల సంస్కృతి కూడ విభిన్నమైన రూపాలు తీసుకుంది. అంటే ఆలీఘడ్‌లో

ఉండే హిందువు - ఏకకాలంలో హిందువుగా, ముస్లింగా జీవించడంలో; కోస్తా ఆంధ్ర ముస్లిం - ఏకకాలంలో ముస్లింగా, హిందువుగా జీవించడంలోనూ సామరస్యత ఉంది. ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలో జరిగిన cultural intercourse వల్ల ఈ భిన్నత్వం ఏర్పడింది. కనుక, ప్రపంచంలోని ముస్లింలు కాదు సరికదా, భారతదేశంలోని ముస్లింలే ఒక వర్గం కాదు.

అయితే, ఈ harmony మన సామాజిక సమతాభావానికి సూచిక ఎంత మాత్రం కాదు. వేల సంవత్సరాలుగా, కొద్దిపాటి రూపాంతరాలతో కొనసాగుతూ వస్తున్న అగ్రవర్ణాల ఆధిపత్య భావం క్రమేణా ఒక విలువగా స్థిరపడిపోయింది. ఎవరి స్థానాలు, హోదాలు వారికి ఖరారైన తర్వాత, ఆయా వర్ణాలు / వర్గాలు వాటి శిరోధార్యంగా అంగీకరించిన తర్వాత, ఆ నిచ్చెన మెట్ల, ఆధిపత్య (hierarchial, hegimonic) వాతావరణం harmonious గా స్థిరపడింది.

ఆ వాతావరణమే కొనసాగితే, అగ్ర పీఠాధిపతులకు ఏ ఇబ్బంది ఉండేది కాదు. కానీ, కాలానుగుణంగా వచ్చిన మార్పులు, ఆ మార్పుల ఫలితంగా వచ్చిన 'ప్రజాస్వామ్య భావన'తో వచ్చింది అబ్రాహ్మణ వ్యవసాయిక శూద్రకులాలతో కొన్ని చోట్ల అధికార పీఠాలు స్థానభ్రంశం పొందుతున్నాయి. అయితే, ఏ విలువలనైతే తాను ప్రతిష్ఠించిందో, ఏ ధర్మాలనయితే తాను చలామణి చేసిందో ఆ విలువలు, ధర్మాల మూలాల్ని ప్రశ్నించే ప్రయత్నం చేయలేదు అబ్రాహ్మణ విజేతలు. అంటు, ఆచారం, మడి, శుభ్రత... వంటి అంశాలు వేటిలోనైనా, బ్రాహ్మణుడి కంటే తాను 'రెండాకులు' ఎక్కువేనని నిరూపించాడు నియోబ్రాహ్మణుడు. జంధ్యం వేయడంలో, యజ్ఞం చేయడంలో, మనుజులను కులజులుగానే గుర్తించి హీనపరచడంలో, అంటరానితనం పాటించి అమానుషత్వాన్ని చాటడంలో బ్రాహ్మణుడిని మించిపోవడమే తన సామాజిక విజయంగా నియో బ్రాహ్మణుడు గుర్తించడాన్ని గమనించి తృప్తి పడింది. ఆ 'బ్రాహ్మణేతర విజయం'తో తాను మరోసారి గెలిచానని నిర్ద్వంద్వంగా నిర్ధారించుకుంది.

అయితే, ప్రజాస్వామ్య భావన సామాజిక రంగంతో ఆగిపోయినట్టయితే ఆ నిశ్చింత అలానే ఉండేది. కానీ, అది రాజకీయ రంగ ప్రవేశం కూడా చేసింది. మనుస్మృతిని గౌరవించి, కొనసాగిస్తూ తెల్లదొరలు; వారి అడుగులకు మడుగులొత్తుతూ బ్రాహ్మణులు కలిసి చేస్తున్న రాజకీయ ప్రయాణం సజావుగానే ఉన్నా, తెల్లదొరలు సాంస్కృతికంగా తమకు సముచిత గౌరవం ఇవ్వలేదన్న నిజాన్ని బ్రాహ్మణులు ఏనాడు విస్మరించలేదు. తమకు లభించిన ద్వితీయ శ్రేణి హోదాని గమనించనట్టు సౌలభ్యం కోసం నటించారు.

ఈ దుగ్ధను అప్పటికి అణుచుకున్నప్పటికీ, రాజకీయ రంగంలో ప్రవేశించిన 'ప్రజాస్వామ్య భావన' తమ ద్వితీయ శ్రేణి హోదాకు కూడా ముప్పు తేవడం గుర్తించి మేలుకున్నారు. తీవ్ర సంక్షోభంలో పడిన తమ ఉనికిని కాపాడుకోవాలంటే, ముందు తెల్లదొరలను తరిమివేయడం వైపు దేశం దృష్టి మళ్ళించడం ఒక తక్షణ అవసరమయింది ఈ వర్గానికి. వారి అవసరాల ఫలితమే - జాతీయోద్యమం, 'స్వాతంత్ర్య పోరాట'మూనూ. కనుక, ఎదురయ్యే 'సమస్య', దానికి వెదకవలసిన 'పరిష్కారం' కావు - అసలు సమస్యలు. ఏ సమస్యా లేకపోవడమే తమ అస్తిత్వానికి అసలు సమస్య.

కొండంత అడ్డంకి గాంధీజీ అని గుర్తించిందా వర్గం.

వలస రాజ్యాల నిర్వహణ అసాధ్యమని, వాటికి స్వాతంత్ర్యం ఇవ్వడం అనివార్యమని రెండవ ప్రపంచ యుద్ధ సమయానికి గుర్తించిన వలస పాలకులు స్వాతంత్ర్యానంతర భారతాన్ని ప్రశాంతంగా ఉచండం ఇష్టంలేక వేసిన ఎత్తే ద్విజాతి సిద్ధాంతం (Two nation theory). 'కాగల కార్యం గంధర్వులే తీర్చిన' ట్లు, వలస పాలకులే 'స్వతంత్ర భారత విభజన' అనే 'మహత్తరమైన సమస్యను సృష్టించి పెట్టినందుకు సంబరపడింది అగ్రవర్ణం. కానీ, దీనిని గాంధీజీ అసలు సమస్య గానే గుర్తించకపోవడంతో వచ్చింది అసలు చిక్కు. హిందు - ముస్లింలు రెండు వైరుధ్య వర్గాలని ఆయన అనుకోకపోవడం వల్లనే దేశ విభజనకు ఆయన అంగీకరించలేదు. ఈ చీలికను నిరోధించడానికై, ముస్లిం నేతలతోనే ప్రభుత్వ ఏర్పాటును కూడా ప్రతిపాదించేంత వరకూ వెళ్లారాయన. ఈ బుజ్జగింపు రాజకీయం ఏ వర్గానికి నచ్చకపోవడం, దేశ విభజన జరిగిపోవడం వల్ల గండం నుంచి గట్టెక్కినట్టు నిట్టూర్చిందా అగ్రవర్ణం. తాత్కాలికంగా గండం గడిచినా, నౌఖాలీ ఘర్షణల రాక్షస ముళ్ల మీద నెత్తుటి పాదాలతో నడిచిన మహా మొండి మనిషి గాంధీతో ఎప్పటికైనా ఇబ్బందేనని అర్థం చేసుకుంది. సమస్యల సృష్టి ముున్ముందు సజావుగా జరగాలంటే, మళ్లీ తమ ప్రాభవం పునర్వైభవంతో వెలిగే 'హిందూ రాజ్య స్థాపన జరగాలంటే, 'గాంధీజీ' అనే విరుగుడు మంత్రాన్ని చెరిపేయాలని నిశ్చయించుకుంది. ఫలితమే గాంధీ దారుణ హత్య !

అడోల్ఫ్ హిట్లర్ 'జర్మన్ నేషన్' బాటలోనే హిందూ రాజ్య సంస్థాపన చేయాలని కంకణం కట్టుకున్న ఈ సంఘ పరివార్ వర్గానికి ఎదురయిన మరో సమస్య 'బలగం'. చాతుర్వర్ణ వ్యవస్థ ద్వారా సామాజిక అసమానతల్ని legitimate చేసిన హిందూమతంలోని లొసుగుల్ని ఆమూలాగ్రం అర్థం చేసుకోలేక పోయినా, తన ఆధిపత్య కుట్రని ప్రశ్నించే దశకు కొన్ని 'సేవక' వర్ణాలు ఎగబాకినందువల్ల, అధికార పీఠాన్ని కైవసం చేసుకోవడం అంత తేలికైన లక్ష్యం కాదని గ్రహించిందా అగ్రవర్ణం. ఆధునిక కవి తన బాధని, ప్రపంచపు బాధ చేసినట్టుగా, తనకు కలిగిన ముప్పును మతానికి, దైవానికే కలిగిన ముప్పుగా నమ్మించే ప్రయత్నం చేయడమే తరుణోపాయమని, తన లక్ష్య సాధనకు సులువైన మార్గమని నిర్ధారించుకుంది. ఇక హిట్లరే తన ఆరాధ్యదైవంగా, ఆయన 'Mein Kampf' ఆదర్శ గ్రంథంగా చేసుకొని, తన దైన కొత్త తంత్రంతో 'హిందూరాజ్య స్థాపన' దిశగా తొలి అడుగువేసింది.

తన పథకం అమలులో భాగంగా సంఘ పరివార్ తొలినాళ్లలో వేసిన పాచికలలో ఒకటి 'గో సంరక్షణ' పిలుపు. ఆవును 'గోమాత' అని పిలిచింది. తల్లి సంరక్షణ మన కర్తవ్యమని గంగడోలును ఆప్యాయంగా సరిచేసింది. ఈ ఎత్తుగడ ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. జన్మనిచ్చిన తల్లినే నిర్లక్ష్యం చేస్తున్న, చేయవలసివస్తున్న పరిస్థితుల్లో, 'ఆవును తల్లిలా' చేసుకోవాలన్న నినాదం 'బరువు'ను కోల్పోయింది. అంతేకాకుండా, వట్టిబోయి, చావుకు సిద్ధమైన గోవుల వధను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్న వర్ణమే, ఎక్కువ పాల కోసం 'తల్లి లాంటి ఆవు'ల మీద 'ఫుకా' వంటి అతి క్రూరమైన పద్ధతులను ప్రయోగించడం వల్ల, వారి గోసంరక్షణోద్యమ మోసం ఎక్కువ కాలం సాగలేదు. (సశేషం)

# గోపాత్రుడి బల్లపరుపు భూమి

– డా॥ బి. పార్వతి

కె. ఎన్. వై. పతంజలి 1952లో జన్మించారు. ఈయన జర్నలిస్టుగా రచయితగా 1975నుంచి రాణిస్తున్నారు. ఆయన అనేక రచనలు చేశారు. వాటిలో ఖాకీవనం, గోపాత్రుడు ప్రముఖమైనవి.

పతంజలి గారి రచనలతో పరిచయం 'గోపాత్రుడు' నవలతో వెల్చేటి సుబ్రహ్మణ్యం గారి ద్వారా, కేంద్ర సాహిత్య అకాడెమీ వారి దక్షిణ సంకలనానికై నేను చేసిన ఆంగ్లానువాదంతో జరిగింది. గోపాత్రుడి అదృష్టమో, అనువాదకురాలి దురదృష్టమో ప్రతిఫలం ముట్టినా ఫలం దక్కలేదు. దక్షిణ సంకలనం రెండవ సంపుటం వెలుగు చూడలేదు. అయినా గోపాత్రుడి పై నాకున్న అభిమానం తగ్గలేదు. తెలుగు రచనలపై వున్న సహజానురక్తితో నేను చదివిన పుస్తకాల జాబితాలో గోపాత్రుడు ప్రథమంగా నిలుస్తోంది. ఒక నవలకి, ఒక రచయితకి చదివించే శక్తి వుండాలి. యద్దనపూడి సులోచనారాణి, యండమూరి వీరేంద్రనాథ్‌లలో ఆ శక్తి చాలా వుంది. రచయితకి కథ చెప్పే నేర్పు వుండాలి, ఆసక్తి నిలపగల తగిన కథా వస్తువు లభ్యమవాలి, అలా లభించిన కథా వస్తువు పరిచయంలేనిదీ విలక్షణమైనదీ అయితే ఆ నవల పాఠకుల మనసులో ముద్ర పడుతుంది. ఈ లక్షణాలన్నీ కలిగిన నవలలను ఎన్.ఆర్. నంది, మల్లాది వెంకట కృష్ణమూర్తి సుమారు 23 సంవత్సరాల క్రితం తెలుగు పాఠకులకు అందించారు. అవి మామూలు నవలలకు భిన్నమైనవి, వస్తు విలక్షణత కలిగినటువంటివి. ఆ విధంగా విలక్షణమైన కథా వస్తువుతో ఉత్తరాంధ్ర మాండలికంలో ఒక చిన్న వూరికి చెందిన మనుషుల జీవితాలు ఆలోచనలతో జ్ఞానాన్ని, శాస్త్ర విజ్ఞానాన్ని, మానవ స్వభావంలోని చాంచల్యాన్నీ మనుషుల స్థైర్యాన్నీ చూపుతూ ఆధునిక ఆలోచనలు చొచ్చుకున్న పల్లెపట్టుల అలవాట్లు, ఆనవాయితీలు సంప్రదాయాలను సజీవంగా నిలబెడుతూ ఆ క్రమంలో మోతాదు మించని, శృతి తప్పని హాయైన హాస్యపు ఖజానాని పంచిన మంచి రచయిత పతంజలి, ఆ రచన గోపాత్రుడు.

లక్షణపరంగా చూస్తే నవలా ప్రక్రియని ఆంగ్లం నించి అప్పు తెచ్చుకున్న తెలుగు సాహిత్యంలో గోపాత్రుడు ఆధునికానంతర వాదానికి ఉదాహరణగా చెప్పవచ్చు. కానీ వస్తుపరంగా ఉత్తరాంధ్ర అచ్చ తెలుగు జన జీవితం రంగరించి లోతైన ఆలోచన, హాస్యం మిళితం చేసి, ఆధునికతని విశ్లేషించే మంచి రచన గోపాత్రుడు. క్షణక్షణమూ చలించే, నిలకడలేని పాదరసం లాంటి వర్తమానాన్ని వ్యక్తి పరంగా, సమాజ పరంగా చూపిస్తూ, నిరంతరం మారే బుద్ధి, భావాల సమాహారంగా చిత్రించి బంధించిన ప్రయత్నం గోపాత్రుడు. నమ్మకాలు, విశ్వాసాలు, వ్యక్తి ప్రయోజనాలు అనే వాటికీ శాస్త్రవిజ్ఞానం, జ్ఞానం, సత్యం, ధర్మం అనే సూత్రాలకీ జరిగే నిరంతరమైన కూడికలు తీసివేతలకి,

---

డా॥ బి. పార్వతి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల విభాగంలో
అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు

నవ్వుకోగలిగే, నవ్వు పుట్టించే ఉదాహరణ గోపాత్రుడు. సత్యాన్ని శోధించి, జ్ఞానాన్ని సాధించి, శాస్త్ర విజ్ఞానాన్ని చర్చకు తీసుకువచ్చి, సమాజం వీటిని ఎలా జీర్ణించుకుందో పరిగణించకుండా. ఇవి సమాజం మీద ఏ విధంగా పని చేస్తున్నాయో చిత్రించే చక్కటి నవల గోపాత్రుడు.

సాహిత్యాన్ని కూడా కలుపుకుని అన్ని రంగాలలోనూ ప్రధానాంశంగా వున్న విషయాలు అప్రధానమై పోయి. అప్రధానంగా అప్రస్తుతంగా వున్న విషయాలు ప్రాముఖ్యతని సంతరించుకోవటం అధునికానంతర వాదపు సారాంశంగా చెప్పవచ్చు. తెలుగు సాహిత్య విశ్లేషణకి భుజాలమీద కెత్తుకున్న మిగతా 'ఇజాల'తో ఇప్పుడు ఆధునికానంతర వాదాన్ని చేర్చడం ఎంత ఒప్పో నాకు తెలీదు. పాదరసం లాంటి వర్తమానాన్ని ఏ మూసలోకైనా పోయవచ్చు. మూస ధృడత్వం పాదరసపు పటుత్వంలాగా కనిపించవచ్చును గానీ కాదు.

అలమండ గ్రామంలో కలి పుట్టించిన ఘనత గోపాత్రుడు మూట కట్టుకుంటాడు. భూమి గుండ్రంగా వుందా బల్లపరుపుగా వుందా అనేది గోపాత్రుడు నవలలోని ప్రధానాంశం. ఈ విషయం మీద అలమండ గ్రామ ప్రజలు చర్చలు, వాదోపవాదాలు. తాత్విక చింతనలు జరిపి, స్నేహం, కులం, వర్గం - ఈ ప్రాతిపదికల మీద రెండుగా చీలిపోతారు. ఈ ఉపద్రవానికి కారకుడైన గోపాత్రుడు తప్ప ఇరుపక్షాల వారూ అభిప్రాయం, నమ్మకం విశ్వాసం, సత్యం అనే విషయాల గురించి తీవ్రంగా ఆలోచిస్తారు. భూమి గుండ్రంగా వుందా లేదా అన్న విషయంలో ఏకీభవించటానికి, విభేదించటానికి, వ్యక్తిగత గుణాలు, లక్షణాలు, లక్ష్యాలు, కులాలు, కోపాలు, ప్రయోజనాలు కారణం అవుతాయి. సమస్య ఊళ్ళో యుద్ధానికి. పోలీసుల రాకకి. ఇరు పక్షాల వారి అరెస్టుకి దారి తీయటమే కాకుండా కోర్టులో 'భూమి బల్ల పరుపుగానే వుందనే' జడ్జిగారి తీర్పుతో అంతమవుతుంది. ఇందరిలో ఇంత తాత్విక చింతన చేయించిన గోపాత్రుడి ముసి ముసి నవ్వులతో నవల ముగుస్తుంది.

కథాస్థలం అలమండ పోలీసు స్టేషను కూడా లేనంత చిన్న వూరు. కథలోని మనుషులు పట్నవాసపు మధ్య తరగతి ప్రజలు అసలే కారు. కుటుంబం, కులం కట్టుబాట్లతో నడిచే జనం. ఎదటి కులాల వారితోనే గాక తమ కులం వాళ్ళతో కూడా తగూలు, స్పర్థలు కలవాళ్ళు. 'ఎగస్పార్టీ' మనుషుల్ని గౌరవించే వాళ్ళూ, తమ వాళ్ళనే చిన్న చూపు చూసేవాళ్ళూ వున్నారు. భూమి గుండ్రంగా వుందని, భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతోందని మనం చదువుకోవటం వల్ల తెలుసుకున్నాం. ఉపగ్రహ చిత్రాల ద్వారా భూమి మాత్రమే కాకుండా మిగతా గ్రహాలు కూడా గోళాకారంలోనే వున్నాయని టీవీలో చూసి తెలుసుకుంటున్నాం. అయితే ఇప్పటికీ ఇంగ్లాండులో ఫ్లాట్ ఎర్త్ సొసైటీ (Flat Earth Society) సంఘ సభ్యులు భూమి బల్ల పరుపుగా వుందని నమ్ముతారట. అలాగే అలమండ గోపాత్రుడు కూడా భూమి బల్లపరుపుగా వుందనే విషయాన్ని చనిపోతూ తన తండ్రి చేసిన ఉపదేశం ద్వారా తెలుసుకున్నాడు. ఈ రహస్యం

గోపాత్రుడి తండ్రికి అతని తండ్రి, ఆ తండ్రికి అతని తండ్రీ చనిపోయే సమయంలో కొన్ని హితబోధలతో పాటు చెప్పారు. ఈ విషయంలో ఎవరేమి చెప్పినా నమ్మవద్దని కూడా తండ్రి గోపాత్రుడికి చెప్తాడు. కాబట్టి భూమి పట్ల తన అభిప్రాయం చనిపోయిన తండ్రి వచ్చి చెపితే గాని మారదని గోపాత్రుడు పట్టు బడతాడు. వైద్యం చేస్తే జబ్బులు పూర్తిగా తగ్గిపోకూడదు, మనుషులు కూడా పోకూడదు, జాగ్రత్తగా, పొదుపుగా, తెలివిగా, గుట్టుగా బతకాలి. నోటు రాసిన బాకీలు వొచ్చే జన్మలో మా నాయన తీరుస్తాడని చెప్పు, చచ్చి దెయ్యమై నీకు చేదోడు వాదోడుగా వుంటాను మరేమీ భయపడవద్దని కూడా గోపాత్రుడికి చెప్పి తండ్రి చనిపోతాడు.

అలమండలో రైతులు రాజులు భూమి ఆకారం గురించి రెండు పక్షాలుగా యుద్ధానికి దిగుతారు. అలా యుద్ధం చేసి గెలిచినవారి అభిప్రాయం ప్రకారం భూమి ఆకారం నిర్ధారించబడుతుందన్న వాదన గోపాత్రుడికి నచ్చదు. తన మాట తన విశ్వాసమూ ముఖ్యమంటాడు. యుద్ధానికి కారణమవుతాడు గానీ అహింసావాదిని కనక యుద్ధాలూ గట్రా నాకిష్టంలేదంటాడు. అప్పుడు ''పిచ్చివాడా యుద్ధాన్ని ఇష్టపడని వాడికి విశ్వాసాలు కలిగివుండే హక్కు వుండదని ఇప్పుడైనా తెలుసుకో. అహింసావాదులు ఎవర్నీ హింసించకపోవచ్చుగానీ ఇతరులు ఎవరైనా వారిని ఎంచక్కా హింసించవచ్చును. ఈ రోజున ఈ గ్రామం పరిస్థితి ఏమిటంటే నువ్వు ఏదో విశ్వాసాన్ని కలిగి తీరాలి. ఏదో పక్షాన నిలబడి సంత బయళ్ళు యుద్ధం చేసి తీరాలి. నువ్వు ఎదటివాడిని కొట్టితీరాలి లేదా వాడితో దెబ్బలు తిని రావాలి'' అని రంగరాజు మేష్టారు వివరిస్తాడు.

రంగరాజు మేష్టారు కూడా ఎంతో ఆలోచన చేస్తాడు. పెదరామ కోవెల్లో భూమి గుండ్రంగా వుందనే, సరైన జ్ఞానం కలిగిన ధూర్తులు దుష్టులకంటె, అజ్ఞానియైనా గౌరవం చూపించి వినయంగా వుండే గోపాత్రుడే యోగ్యుడని రంగరాజు మేష్టారు తర్కించుకుంటాడు. చెప్పిన మాట మీద నిలబడని రొంగలి అమ్మన్న, ధర్మంకోసం నిలబడని సేనాపతి అరసవిల్లి లాటివాళ్ళు భూమి గుండ్రంగా వున్నదని నమ్మినంత మాత్రాన ఉపయోగం, పాత్రుడి నమ్మకం వలన అపకారం జరగవని ఆయనకి తెలుసు. అయితే భూమి గుండ్రంగా వుందని పాఠం చెప్పిన తనే యోగ్యుడైన శిష్యుడి కోసం బల్ల పరుపుగా వుందని ఒప్పుకోలేని రంగరాజు మేష్టారు పోగొట్టుకోవటం ఇష్టంలేని కీర్తికోసం, శిష్యుడితో ఏకీభవించటం ఇష్టమైనా అది బహిరంగంగా ఒప్పుకోలేనంటాడు. కానీ వాత్సల్యం కల మేష్టారుగా ఇతరుల వద్ద గోపాత్రుడిని పల్లెత్తు మాట అనకుండా, అతని దగ్గిర అతనే రైటంటానని చెప్తాడు. ఈ మాట లేవీ గోపాత్రుడికి అర్థం కావు. ''అవునుమరి నాకే అర్థం కాలేదు ఏమిటన్నానో... చిన్న కుర్రాడివి నీకేం అర్థం అవుతుంది'' అని మేష్టారు అనుకుంటాడు. ఈ సందర్భంగా ఆయన చాలా ఆలోచిస్తాడు. ''ఏ సంగతైనా ఎలా తెలుస్తుంది? చదుకోవటం వల్ల నమ్ముతున్నాం. చదివినదాన్ని నమ్మటం వలన నమ్ముతున్నాం. విశ్వాసాలు ప్రమాదకరమా, విశ్వాసానికి సత్యానికి సంబంధం వుంటుందా, సత్యాలు విశ్వాసాల కోవలోకి వస్తాయా?'' అన్న ఆలోచన చేసి తన

ఆలోచనా శక్తికి తనే అబ్బురపడతాడు రంగరాజు మేష్టారు. విశ్వాసాల వల్ల ఉపయోగం లేదు. జ్ఞానం వల్ల వినియోగం లేదని నిర్ణయించుకుంటాడు.

తనని పంచాయితీ బోర్డు మెంబర్ని చెయ్యనందుకు కోపించిన బిత్తిరిసోవులు గోపాత్రుడికి మద్దతుగా ఫకీర్రాజు పక్షంలో చేరతాడు. సోవులు ఉద్దేశం ప్రకారం భూమి ''రాజులకైతే మిస్సమ్మ బంజర్నాగ, మామిడి తోట్నాగుండాల, రైతోడి భూవి పెదచెరువు కింద నాగులోడి ఇస్తువా నాగుండాల, వరి సేని మడి నా గుండాల! మా హరిజనుల భూవి కాలనీ గట్టించటానికి సరిపడేలాగ సుబ్బరం గుండాల. సాకలోళ్ళ భూవి సాకిరేవులాగ సక్కగుండాల, మంగలోడి భూవి తలమాసినోడి బుర్ర నా గుండాల. కానీ ఊర్లోని పోలిటిక్సును బట్టి ఈయాల్లో మనందరి కది బల్లపరుపు గున్నది. రైతాంగానికి గుండ్రంగున్నాది.''

తమ కులంవాడైనా, పంచాయితీ ప్రెసిడెంటయినా ముత్యాల నాయుడికి ఊరందరి తరపునా భూమి గుండ్రంగా వుందని చెప్పటానికి హక్కులేదని రొంగలి బుజ్జి గట్టిగా నమ్ముతాడు. అందుకు కారణం పంచాయితీలో అన్ని పదవులూ ప్రెసిడెంటు ముత్యాలనాయుడి కుటుంబానికే పరిమితమవటం. ''నాకులవన్నాక నాక్కూడా పనికిరావాల గదా? నేదే? పనికి రానేదు! మరలాంటప్పుడు నేను నా కులపోళ్ళతో ఎందుకు తిరగాల?'' కాబట్టి రొంగలి బుజ్జి తన తమ్ముడి కొడుకైన రొంగలి అమ్మన్నని గోపాత్రుడు - ఫకీర్రాజుల పక్షానికి తిప్పుతాడు. అయితే శత్రువులు మన పక్షంలోనూ మిత్రులు శత్రుపక్షంలోనూ వుంటే యుద్ధం ఎవరిమీద చెయ్యాలి అన్న అమ్మన్న ధర్మ సందేహానికి ''దొమ్మీ యుద్ధం బగవంతుడు మనకి ఇచ్చిన అవకాశం, దీన్ని ఉపయోగించి నీకు ఎవరిమీద కడుపు మంటగా వున్నాదో ఆ నంజి కొడుకులందర్నీ తాట తీసీ'' అని ఉపదేశం చేస్తాడు. ఈ ఉపదేశం పొందటానికి ముందు అమ్మన్న చాలా ఆత్మశోధన చేసుకుంటాడు. గోపాత్రుడి దగ్గర రెండు రూపాయల అప్పు పుట్టక గుండ్రపు భూమి గుంపులో చేరిన రొంగలి అమ్మన్నకి ఫకీర్రాజు నుంచి ముట్టిన పాతిక రూపాయలకి లక్ష ప్రశ్నలు తలలో పుడతాయి. పాతిక రూపాయలకోసం, భూమి గుండ్రంగా వుందనేసిన తను అభిప్రాయం మార్చుకుని డబ్బు కోసం గడ్డి తిన్నాడా? లొంగిపోయాడా? అసలు అబిప్పరాయం అంటే ఏమిటి? మనకసలు అదున్నాదా? అది వుంటే మంచిదా? లేకపోతే మంచిదా? పదిమందిలో తొమ్మండుగురు ఏవంటే అదే అభిప్రాయం కాదా? పదోవాడిది అప్పుడు అభిప్రాయం కిందికి ఒస్తదా రాదా?... సొమ్ముల కోసం అభిప్రాయం మార్చుకోడానికి సిద్ధమైపోయినపుడు పాతిక రూపాయలకంటే ఎక్కువ ఉచ్చుకోవచ్చని నాకెందుకు తట్టలేదు?'' అనుకున్న అమ్మన్నకి తన కులపు భూమి గుండ్రం ముత్యాల నాయుడి మీద అభిమానం పొంగి, అబద్ధాలు కల్పించి దొమ్మీకి కారణమవుతాడు. అయితే ఆ సమయంలో అర్జున విషాదయోగం ఆవరించి చీకట్లో కొట్టటం తప్ప ఎదటబడి ఎవర్నీ కొట్టటం అలవాటు లేనందున యుద్ధం

చెయ్యలేనంటాడు. అప్పుడు పెద తండ్రి బుజ్జి "నీ సేతిలోని కర్ర ఎదటోడి నెత్తి బద్దలు కొట్టటానికే వున్నాదనీ భ్రమను వొదిలేసుకో" అది నీ బుఱ్ఱ పగలకుండా కాపాడుకొనటం కోసం కూడా వున్నదని తెలుసుకో" అని జ్ఞానం కలిగిస్తాడు.

భూమి ఆకారాన్ని గురించిన అభిప్రాయ భేదంలో ముందు నించి గోపాత్రుడి పక్షాన వున్న కుక్క వీరబొబ్బిలి కూడా, నీతి, అవినీతి, రాజనీతి అనే అంశాలని విశ్లేషిస్తుంది. విన్నదంతా నిజం కాదని బొబ్బిలికి తెలుసు, చదినవన్నీ నిజమని నమ్ముతారు మనుషులు. కాబట్టే మనిషికీ కుక్కకి సాపత్యం లేదని, సత్యాన్ని తెలివి తక్కువవాళ్ళు స్వయంగా తడిమి, చూసి, మూ చూసి తెలుసుకుంటే తెలివి గలవాళ్ళు ఊహించి తెలుసుకుంటారని బొబ్బిలి అంటుంది. అలాగే "జ్ఞానం అమూల్యమైనది, దాన్ని ఎవరిమటుకు వారే సంపాదించుకోవాలి. జ్ఞానాన్ని దానం చేయకూడదు. దొంగిలించకూడదు. బిచ్చంగా పుచ్చుకోకూడదు. అసలు మన జ్ఞానాన్ని ప్రదర్శించకూడదు అని కూడా స్వగతిస్తుంది. పరమాత్మ గురించి ఎవరికి తోచినట్టు వాళ్ళు ఊహించుకున్నట్టు భూమి గురించి కూడా ఎవరికి తోచినట్టు వాళ్ళు అనుకోవచ్చునంటుంది. "మన అజ్ఞానం వల్లే ఎలాంటి నష్టం లేనపుడు ఎదటివాడి అజ్ఞానం వల్ల నష్టం ఏముంది?" అని తర్కించిన బొబ్బిలి, గేద కొమ్ములా వున్న భూమిని పట్టుకుని బల్లపరుపుగా వుందంటున్న గోపాత్రుడినీ అతనితో ఏకీభవిస్తున్న ఫకీర్రాజునీ దద్దమ్మలుగా పరిగణిస్తుంది.

అహింసా వాదులు ఏం చెయ్యాలి, ఏం చెయ్యకూడదు. హింసా వాదులు ఏం ఏం చేస్తారు. అభిప్రాయం అంటే ఏమిటి? అది మంచిదా చెడ్డదా, వుండచ్చా వుండకూడదా, దాన్ని మార్చుకోవచ్చా, కులమన్నది ఎవరికి పనికి రావాలి. ఒక్కడికా అందరికా, విశ్వాసాల కోసం యుద్ధాలు జరిగితే ఓడినవాడి మీదగెలిచినవాడి విశ్వాసం రుద్దెయ్యవచ్చా. మనుషులు ఎవరికి భయపడతారు, చేతిలో కత్తివున్నవాడికి కర్రమాత్రమే వున్నవాడూ. చేతిలో ఏమీలేనివాడు కర్రమాత్రమే వున్నవాడిక్కూడా భయపడతాడు. శత్రువుని మన పక్షంలో వున్నా కొట్టచ్చు మొదలైన ఎన్నో నిర్ణయాలు. ఆలోచన, నమ్మకం, మాట, చేతల మధ్య పొంతన కుదరటం స్వప్రయోజనాన్ని బట్టే వుంటాయనే విషయం గోపాత్రుడు ద్వారా తెలుస్తుంది. ఈ సందర్భంగా వాద ప్రతివాదనలు రెండూ సమంజసంగానే వున్న విషయం ఏకపక్షం కాని రచయిత సమ దృష్టికి నిదర్శనం. ఇందుకు తోడు నవలలోని ప్రతి వాక్యానికీ తన్నుకొచ్చే నవ్వుని ఆపటం పాఠకుల తరం కాదు. హాస్య రచన చేయటం రచయిత ఉద్దేశమో కాదో తెలీదు కానీ హాస్యం పుష్కలంగా పండిన ఈ నవల ఎంతోలోతుగా లోకం పోకడలని మనుషుల నడవడికలని కూడా అతి సులభంగా ప్రదర్శించే అతి ప్రత్యేకమైన రచన.


"Published with Financial Assistance from the Central Institute of Indian Languages, (Ministry of Human Resource Development, Dept. of Secondary and Higher Education, Govt. of India) Manasagangotri, Mysore - 570 006 vide sanction Letter No. F. 53-1/2001-2002/LM/GRNT dated 19th March, 2002 under the scheme of Grant-in-Aid L.M."



**చిందరవందరగా ఉన్న శయ్య.**

18వ శతాబ్దంలో కామ ప్రకోప కళలో ఇటువంటిది మామూలే. అందుకని ఫ్రాగొనార్డ్ చిత్రాలలో అది అంతర్భాగమైంది. గోన్‌కోర్ట్ సోదరులు ఆయన గురించి ఇలా రాశారు. "సున్నిత ధవళ పక్క బట్టలను, దిండు మడతలను, అతిగా బట్టబయలు చేసే మంచం తెరలను, చిందరవందరగా ఉన్న పరుపును కేవలం అలా తాకితేనే చాలు అతని కళా స్ఫూర్తి మత్తెక్కి ఉద్రేకిస్తుంది.

MISIMI/ మిసిమి RNI Regd. No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd.No.H/SD/19



ఫ్రాంకో బౌషె చిత్రించిన "నిద్రిస్తున్న శుక్ర దేవత"

ఇతడు ఫ్రాగొనార్డ్‌కు గురువు. ఇతడు చిందరవందరైన పడకను అత్యంత నిపుణతతో, ముఖ్యంగా తన పురాణ గాథా చిత్రాలలో ఉపయోగించుకొన్నాడు. ఏదో యదాలాపంగా పరిచిన నున్నని మెత్తని పక్క బట్ట అతడి నగ్న శుక్రదేవత అందాలను ఇనుమడింపజేస్తోంది.